

# ఆనంద మెగా

నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థుల సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ-25 నోటిఫికేషన్‌ను ఆదివారం విడుదల చేసింది. జిల్లాలో 672 టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు అందులో పేర్కొంది. మూడు నెలల్లో ప్రక్రియను పూర్తి చేయనుంది. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. దీంతో అభ్యర్థులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

## డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

### జిల్లాలో 672 ఖాళీల ప్రకటన

- మే 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 6 నుంచి జూలై 6 వరకు సీబీటీ పరీక్ష నిర్వహణ

ఒంగోలు విద్య, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకుంది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదు. ఒక్క రెగ్యులర్ టీచర్ పోస్టును కూడా భర్తీ చేయలేదు. తీరా ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు డీఎస్సీ ప్రకటించింది. ఆ ప్రక్రియ మధ్యలోనే ఆగిపోయింది. దీంతో ఆరు సంవత్సరాలుగా డీఎస్సీ లేక నిరుద్యోగ అభ్యర్థులు డీలాపడ్డారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా మెగా డీఎస్సీని ప్రకటించి శుభవార్త చెప్పింది.

**ఎస్‌జీటీ పోస్టులు 106 మాత్రమే**

రాష్ట్రంలో మొత్తం 16,347 టీచర్ పోస్టులకు మెగా డీఎస్సీ ప్రకటించగా జిల్లాలో 672 పోస్టులు భర్తీ చేయనున్నారు. అందులో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్ యాజమాన్యాల ఆధ్వర్యంలోని పాఠశాలల్లో 629, గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల్లో 43 పోస్టులు ఉన్నాయి. రాష్ట్రంలో అన్ని జిల్లాల కంటే తక్కువగా మన జిల్లాకు సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు కేవలం 106 మాత్రమే ప్రకటించారు. స్కూలు అసిస్టెంట్ తెలుగు 39, హిందీ 23, ఇంగ్లీషు 95, గణితం 94, ఫిజికల్ సైన్స్ 24, బయోలాజికల్ సైన్స్ 70, సోషల్ స్టడీస్ 106, స్కూలు అసిస్టెంట్ వ్యాయామ విద్య 72, ఎస్‌జీటీ 106 పోస్టులు భర్తీ చేయనున్నారు.

**గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలలకు 43 ప్రకటన**

గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల్లో మొత్తం 43 టీచర్ పోస్టులు ప్రకటించారు. తెలుగు రెండు, హిందీ నాలుగు, ఇంగ్లీషు నాలుగు, గణితం ఒకటి, పీఎస్ 2, బీఎస్ 2, సోషల్ స్టడీస్ 2, ఎస్‌జీటీ 26 పోస్టులు ఉన్నాయి. ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు, బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాలు, ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల్లో ఖాళీలను రాష్ట్ర, జోనల్ స్థాయిలో భర్తీ చేస్తారు.

**షెడ్యూల్ ఇదీ**

- 20న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల
- 20వతేదీ నుంచి మే 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- మే 20నుంచి ఆన్‌లైన్‌లో మాక్ టెస్టులు
- మే 30నుంచి అభ్యర్థుల హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- జూన్ 6నుంచి జూలై 6 వరకు అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)
- సీబీటీ ముగిసిన రెండు రోజుల తర్వాత ప్రాథమిక కీ విడుదల
- ఆ తరువాత వారం రోజులపాటు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అనంతరం మరో వారం తర్వాత తుది కీ విడుదల చేస్తారు.
- తుది కీ విడుదల చేసిన ఏడు రోజులకు అభ్యర్థుల మార్కులు, మెరిట్ జాబితాలను ప్రకటిస్తారు.

**మెరిట్ కం రోస్టర్ విధానంలో ఎంపిక**

టీచరు పోస్టులకు మెరిట్ కం రోస్టర్ విధానంలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. డీఎస్సీలో ఎంపికైన వారిని పూర్తి వేతనంతో రెగ్యులర్ పోస్టులో నియమిస్తారు. అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తులో అన్ని వివరాలను పేర్కొనాలి. తప్పుడు సమాచారం ఇస్తే వారిని డీఎస్సీకి అనర్హులుగా ప్రకటించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు.

**కొందరికి దరఖాస్తు ఫీజు మినహాయింపు**

మెగా డీఎస్సీలో కొందరు అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఇచ్చారు. డీఎస్సీ-2024కు దరఖాస్తు చేసి ఫీజు కట్టిన అభ్యర్థులు ఇప్పుడు చెల్లించాల్సిన అవసరం లేదు. అదనపు పోస్టులకు దరఖాస్తు చేయదలుచుకుంటే ఒక్కోదానికి రుసుంగా రూ.250 చెల్లించాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు.

## భక్తిశ్రద్ధలతో ఈస్టర్



ఈస్టర్‌ను జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తు పునరుత్థానాన్ని ఘనంగా స్వాగతించారు. పరిశుద్ధతకు చిహ్నంగా తెల్లదుస్తులు ధరించి వేకువజాము నుంచే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒంగోలులోని కొండపైన సూర్యోదయ ఆరాధన నిర్వహించారు. సీనియర్ పాస్టర్ డి.జాన్ అగస్టీన్, పాస్టర్ జాన్ కెనడీ వేర్వేరుగా వాక్యోపదేశం చేశారు. ఎక్కడికక్కడ క్రైస్తవుల సమాధుల వద్ద పెద్దఎత్తున మృతుల జ్ఞాపకార్థ ప్రార్థనలు చేశారు.

- లోపలి పేజీల్లో..



## హరిత హారం

ప్రేమతో చెట్ల పెంపకం

దాదాపు 200కుపైగా సంరక్షణ

అభయాంజనేయస్వామి ట్రస్టు సభ్యుల స్ఫూర్తి

7



## కలలు కరిగే... కన్నీరే మిగిలే..!

పిడుగుపాటుకు ఇద్దరు విద్యార్థుల మృతి

పెద్దఓబినేనిపల్లెలో విషాదం



పిడుగుపాటుకు మృతి చెందిన విద్యార్థులు అకాశ్, సన్నీ (ఫైల్)

తల్లిదండ్రుల కాయ కష్టం వారిని కదిలించింది. జీవితంలో పైకి రావాలన్న ఆకాంక్షను పురిగొల్పింది. పోలీసు శాఖలో కొలువే లక్ష్యంగా కళాశాల విద్య నుంచే సాధన చేస్తుండగా పిడుగుపాటు ఆ ఇద్దరు విద్యార్థులను మింగేసింది. తల్లిదండ్రులకు కన్నీరును మిగిల్చింది. ఈ విషాదం బేస్తవారపేట మండలం పెద్దఓబినేనిపల్లెలో ఆదివారం చోటుచేసుకుంది.

వివరాలు మెయిన్‌లో..

## అధికారులంటే లెక్కలేదు..!

- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సచివాలయ సెక్రటరీలు డుమ్మా
- 29 మందికి మెమోలు .. మరి కొందరిపై వేటు..?

7

## శ్రీమహావిష్ణువుగా చెన్నయ్య

మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం స్వామివారు మహావిష్ణువు అలంకారంలో గరుడ వాహనంపై దర్శనమిచ్చారు. నాలుగు మాడవీధుల్లో విహరించారు. భేరీవాయిద్యాలు, తప్పెట్ల మధ్య నగరోత్సవం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు తిలకించి పులకించిపోయారు.

7



## భూం!

### రియల్‌కు రెక్కలు

ఒంగోలుకు తూర్పున విమానాశ్రయం

భూసేకరణకు రూ.115.78 కోట్లు మంజూరు

పడమరవైపు మరో బైపాస్‌కు ప్రతిపాదన

పెరిగిపోతున్న భూముల ధరలు

జిల్లా కేంద్రమైన ఒంగోలులో భూముల ధరలు రెక్కలు తొడుగుతున్నాయి. నగరానికి తూర్పువైపున విమానాశ్రయం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతివ్వడంతోపాటు భూ సేకరణకు నిధులు మంజూరు చేసింది. పడమర వైపున రెండో బైపాస్ నిర్మాణానికి డీపీఆర్ తయారవుతోంది. ఈ పరిణామాలతో రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుంటోంది. - ఒంగోలు క్రైం, ఆంధ్రజ్యోతి

**కొత్తపట్నం వైపు రెట్టింపైన భూముల ధర**



ఒంగోలుకు తూర్పున కొత్తపట్నం మండలం ఆలూరులో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. భూసేకరణకు సంబంధించి రూ.115.78 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఆవైపున కొప్పోలు నుంచి కొత్తపట్నం వరకు ఉన్న భూముల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. చింతల-అల్లూరు మధ్య గతంలో ఎకరా రూ.కోటి పలికిన భూమి ప్రస్తుతం రూ.2 కోట్లకు చేరింది. రియల్ వ్యాపారులు కూడా ఆవైపు భూముల కొనుగోళ్లకు మొగ్గుచూపుతున్నారు దీనికితోడు కొత్తపట్నంలో ఫిషింగ్ యార్డు మంజూరైంది. అందుకు సంబంధించి ప్రాథమిక చర్యలు కూడా ప్రారంభమయ్యాయి. రానున్న కాలంలో కొత్తపట్నం బీచ్ అభివృద్ధిపై పర్యాటక శాఖ అధికారులు కూడా దృష్టి సారించారు. దీంతో ఒంగోలుకు తూర్పువైపున రియల్ భూం వచ్చింది.

**పడమర వైపు బైపాస్‌కు రెండు ప్రతిపాదనలు**

ఒంగోలుకు పశ్చిమంగా మరో బైపాస్ ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించారు. అందుకు సంబంధించి రెండు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అందులో మద్దిపాడు మండలం కొష్టాల్ సెంటర్ నుంచి సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక మీదుగా మంగమూరుకు పడమర వైపుగా తూర్పునాయుడుపాలెం వద్ద జాతీయ రహదారిలో కలపాలన్నది ఒక ప్రతిపాదన. అదేవిధంగా త్రోవగుంట వద్ద చీరాల బైపాస్ నుంచి లింగంగుంట, పేర్నమిట్ట మీదుగా మంగమూరు, వెంగముక్కపాలెం, భగీరథ కెమికల్స్, చెరువుకొమ్ముపాలెంలోని బీఈడీ కాలేజీ మీదుగా జాతీయ రహదారిలో కలిసేలా మరో డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. ఇలా రెండు ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. దీంతో ఒంగోలుకు పశ్చిమ ప్రాంతం వైపు కూడా భూముల విలువ పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే సంతనూతలపాడు, ఎండ్లూరు, మంగమూరు, చెరువుకొమ్ముపాలెం, యరజర్ల, పెళ్లూరు ప్రాంతాల వైపు పొలాల కొనుగోలుకు రియల్టర్లు సిద్ధమయ్యారు. ఒక వేళ రహదారి భూసేకరణలో భూములు తీసుకున్నా ఎకరాకు రూ.2కోట్ల వరకూ ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందన్న అంచనాతో ముందుకు సాగుతున్నారు. అయితే రైతులు భూములు విక్రయించేందుకు ముందుకు రావడంలేదు. వచ్చే ఆదాయం ఏదో తామే పొందవచ్చన్న ధోరణితో వారు ఉన్నారు.

**రియల్టర్లలో ఆనందం**

ఒంగోలులో ఐదేళ్లుగా రియల్ ఎస్టేట్ రంగం ఆటుపోట్లను ఎదుర్కొంటోంది. అధిక పెట్టుబడులు పెట్టి కొనుగోలు చేసిన భూములు అమ్ముడుపోక అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో అటు విమానాశ్రయం, ఇటు ఒంగోలుకు మరోబైపాస్ ప్రతిపాదనతో రియల్టర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది ఒంగోలులో ఎయిర్ పోర్టు కోసం భూముల సేకరణకు ప్రభుత్వం ఇచ్చిన జీవో కాపీని తమ ఫోన్ స్టేటస్‌గా పెట్టుకోవడం గమనార్హం. బైపాస్ ప్రతిపాదనతో రెండు రోజులుగా ముంగమూరు రోడ్డు వైపు రియల్టర్ల తాకిడి పెరిగింది. .



సీఎం చంద్రబాబు జన్మదినోత్సవం సందర్భంగా తూర్పునాయుడుపాలెంలో కేక్ తినిపించుకుంటున్న మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ సత్య

## తెలుగు తమ్ముళ్ల సంబరాలు

- ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు
- దేవాలయాల్లో పూజలు, సేవా కార్యక్రమాలు

ఒంగోలు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ఆదివారం తెలుగు తమ్ముళ్లు సంబరాల్లో మునిగిపోయారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, కొండపి నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య సంయుక్తంగా తమ స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో నిర్వహించిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. వల్లూరమ్మ దేవాలయంలో దామచర్ల సత్య పూజలు చేశారు. కొండపిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మంత్రి స్వామి పాల్గొన్నారు. ఒంగోలులోని నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పాల్గొనగా, భాగ్యనగర్‌లోని పార్లమెంటు కార్యాలయంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కనిగిరిలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తన కార్యాలయంలో పార్టీ శ్రేణుల కోలాహలం మధ్య కేక్‌కట్ చేశారు. గిద్దలూరులో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నేతృత్వంలో వేడుకలు జరిగాయి. ఎర్రగొండపాలెం పార్టీ కార్యాలయంలో అక్కడి టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, దర్శి నియోజకవర్గ కేంద్రంలో అక్కడి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. ఎస్.ఎన్.పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ తన కార్యాలయంలో కేక్‌కట్ చేశారు.



ఒంగోలులో కేక్‌కట్ చేస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్



టంగుటూరులో మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన సత్య



ఒంగోలులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్



ఎన్టీఆర్‌పార్కులో కేక్ కట్ చేస్తున్న కమిటీ నాయకులు

# నిత్యకృషీవలుడు చంద్రబాబు

మంత్రి డాక్టర్ స్వామి ● కొండపిలో ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు ● ఒంగోలులో కేక్ కట్ చేసిన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల
టీడీపీ శ్రేణులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ● టంగుటూరులో పాల్గొన్న మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ సత్య

కొండపి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర నిర్మాత, రాష్ట్రాభివృద్ధి కోసం 75 ఏళ్ల వయస్సులో పాటుపడుతున్న నిత్య కృషీవలుడు సీఎం చంద్రబాబు నాయుడు అని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. చంద్రబాబు జన్మదిన సందర్భంగా మంత్రి కొండపిలోని సచివాలయం వద్ద ఆదివారం జరిగిన వేడుకల్లో మంత్రి స్వామి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, టీడీపీ సీనియర్ నాయకులు బత్తుల నారాయణస్వామి, చాగంరెడ్డి నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, కొర్రపాటి వసంతరావు, బూదవాటి సోమయ్య, నన్నూరి సుబ్బరామయ్య పాల్గొన్నారు. ఇలవర (నేతివారిపాలెం) గ్రామ టీడీపీ నాయకులు మన్నెం శ్రీను ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. చినకండ్లగుంట గ్రామంలో పార్టీ నాయకుడు తుళ్లూరి బాలచెన్నయ్య ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు కేక్ కట్‌చేసి పంచారు.

### ఒంగోలు నగరంలో..

ఒంగోలు కార్పొరేషన్: ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలు ఆదివారం టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఒంగోలులోని ఎన్టీఆర్‌భవన్‌లో జరిగిన వేడుకల్లో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, శ్రేణుల మధ్య కేక్ కట్ చేసి సంతోషాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా మాగుంట, దామచర్ల మాట్లాడుతూ విజన్ కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని, రాష్ట్ర భవిష్యత్ కోసం అహర్నిశలు కష్టపడే శ్రామికుడని కొనియాడారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలు సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, వైవీ.సుబ్బారావు, బండారు మదన్, యక్కల తులసీరావు, ఆర్ల వెంకటరత్నం, నాళం నరసమ్మ, కామరాజుగడ్డ కుసుమకుమారి, అనంతమ్మ, బీరం అరుణరెడ్డి పాల్గొన్నారు.

### స్మార్ట్‌విజన్ ఆధ్వర్యంలో..



వేడుకల్లో పాల్గొన్న నాయకులు, డాక్టర్లు

సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు స్మార్ట్ విజన్, చైతన్య కార్డియాక్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. స్థానిక 33వ డివిజన్‌లో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు నల్లూరి రవి నేతృత్వం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించి ఉచిత వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్యామల, విష్ణు పాడిబండ్ల, కొమినేని మస్తాన్‌చౌదరి, వెంకటేశ్వర్లు, గంగవరపు కృష్ణమోహన్, మండే శ్రీమన్నారాయణ, బూత్ ఇన్‌చార్జిలు భీమవరం యలమంద, గోనుగుంట్ల యువన, అప్పలనేని ప్రవీణ్‌కుమార్, ఏటి బ్రహ్మయ్య, దానబోయిన కృష్ణ, మాధవరావు పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ పార్కులో..

నగరంలో 37వ డివిజన్‌లోని ప్రసన్న చెన్నకేశవ లేఅవుట్ (ఎన్టీఆర్) పార్కులో ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు.కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్, పార్కు అభివృద్ధి కమిటీ ప్రతినిధులు చెన్నుపాటి వరప్రసాద్, నిడమనూరి నాగేశ్వరరావు, గణపతి మాస్టారు, రామసుబ్బారావు, కుర్రా భాస్కర్‌రావు, ఆవుల ప్రసాద్, పార్కు అభివృద్ధి కమిటీ నాయకులు పాల్గొన్నారు.

### జీజీహెచ్‌లో దివ్యాంగుల రక్తదానం

తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్‌అజీమ్ ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో కేక్ కట్ చేసి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఒంగోలు, శింగరాయకొండకు చెందిన పలువురు దివ్యాంగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల రిజర్వేషన్లు కల్పించి, పింఛన్లు పెంచి ఆదుకున్న మహనీయుడు చంద్రబాబు అని కొనియాడారు.

### టీఎన్‌యూఎస్ ఆధ్వర్యంలో..



వేడుకల్లో పాల్గొన్న మురళీకృష్ణ, రవీంద్ర

ఒంగోలు(రూరల్): ఒంగోలులోని సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్‌లో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) ఆధ్వర్యంలో ఆదివారం సీఎం చంద్రబాబు జన్మదినం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మోతుకూరి రవీంద్ర కేక్ కట్ చేశారు. దివ్యాంగులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు మండవ మురళీకృష్ణ, నాయకులు మన్నం శ్రీనివాస్, చెరుకూరి పూర్ణచంద్రరావు, కొత్తగొర్ల వెంకటరావు, అరైబోయిన రాంబాబు, యనమల ఆంజనేయులు, బాపూజీ, గోరంట్ల శ్రీను, ట్రస్ట్ చైర్‌పర్సన్ షెహనాజ్, చైర్మన్ షేక్ సర్దార్‌బాష పాల్గొన్నారు.

### శ్రీవికాస్ కోచింగ్ సెంటర్‌లో..

నగరంలోని శ్రీవికాస్ కోచింగ్‌లో సీఎం చంద్రబాబు పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మండవ మురళీకృష్ణ 70మంది విద్యార్థులకు స్వీట్లు, నోట్ పుస్తకాలు, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో పి.వీరయ్య, మండవ సుబ్బారావు, కందిమళ్ల నరసింహారావు, కె.శివప్రసాద్, కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ కె.మోహనరావు, ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, జి.చంద్రశేఖరరెడ్డి, టి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

### బధిరుల పాఠశాలలో..

నగరంలోని బధిరుల పాఠశాలలో ఆదివారం సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 100మంది విద్యార్థులకు దుస్తులు, పండ్లు, బిస్కెట్లు, చాక్‌లెట్లు అందించారు. కార్యక్రమంలో బొడ రామకృష్ణయాదవ్, నల్లూరి అశోక్, గుమ్మా గంగరాజు, మారబోయిన గంగరాజు, చల్లా నాగే



కేక్ కట్ చేస్తున్న టూరిజం బోర్డు చైర్మన్ బాలాజీ

శ్వరమ్మ, కొండరాజు శ్రీనివాసయాదవ్, బంకా చిరంజీవి, ద్రవిడదేశం కృష్ణారావు, రాఘవరాజు, జాలయ్య, శ్రీనివాసయాదవ్, సుబ్రహ్మణ్యం, హరిబాబు పాల్గొన్నారు.

### శివం శరణాలయంలో..

ఒంగోలు కల్చరల్: సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆదివారం స్థానిక అన్నవరప్పాడులోని శివం శరణాలయంలో ఘనంగా నిర్వహించారు. ఒంగోలు పార్లమెంటరీ తెలుగు మహిళా కార్యదర్శి మండవ లావణ్య ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం 300 మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గుండ్లకమ్మ సేవా సమాఖ్య అధ్యక్షుడు మండవ సుబ్బారావు, శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, మానవతా సేవా సంస్థ అధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు, మోటుపల్లి వెంకటేశ్వర్లుచౌదరి, దేవారెడ్డి శరత్‌బాబు పాల్గొన్నారు.

- స్థానిక జిల్లా గ్రంథాలయంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ, టీడీపీ నాయకురాలు చెరుకూరి ఆదిలక్ష్మి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, అనిల్‌బాబు, ఇమ్మానియేలు పాల్గొన్నారు. అనంతరం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు.

### దుబాయ్‌లో చీమకుర్తి నేతలు..

చీమకుర్తి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలను ఆదివారం టీడీపీ నాయకులు దుబాయ్‌లో ఘనంగా నిర్వహించారు. కూనంనేనివారిపాలెంకు చెందిన ఎన్ఆర్ఐ నల్లూరి వెంకటశేషయ్య ఆధ్వర్యంలో దుబాయ్‌లో జరిగిన చంద్రబాబు పుట్టినరోజు వేడుకల్లో గనులశాఖా మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కారుమంచి మేజర్ కెనాల్ పునరుద్ధరణకు డీఎంఎఫ్ నిధుల మంజూరు జరిగేలే చర్యలు తీసుకోవాలని శేషయ్య మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించారు.

అలాగే చీమకుర్తిలోని బధిరుల పాఠశాలలో బాబు యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ నాయకుడు పూనాటి వెంకట్రావు కేక్ కట్‌చేసి దివ్యాంగ విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఒరుగంటి



చిన్నారులకు కేక్ తినిపిస్తున్న నాయకులు

పవన్‌కుమార్, గొట్టిపాటి రామవరావు, శ్రీనివాసరావు, ప్రసాద్, శేషారావు, కృష్ణ, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేశారు. నాయకులు గొట్టిపాటి రాఘవరావు, కాట్రగడ్డ రమణయ్య, సూరంపల్లి హనుమంతరావు, రావిపాటి రాంబాబు, పూనాటి వెంకట్రావు, కందిమళ్ల గంగాధరరావు, అవనిగడ్డ శేషారావు, నర్రా నాగరాజు, గంగుల శివపార్వతి, వెంకాయమ్మ పాల్గొన్నారు.

### బీఎన్ కార్యాలయంలో..

సంతనూతలపాడు: సీఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ టీడీపీ నాలుగు మండలాల అధ్యక్షులు, నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అలాగే సంతనూతలపాడులోని టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు అధ్యక్షతన వేడుకలు జరిగాయి. అనంతరం స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, గొట్టిపాటి రాఘవరా



వేడుకల్లో పాల్గొన్న హరిబాబు



మద్దిపాడులో చలివేంద్రాన్ని ప్రారంభించిన జయంత్‌బాబు

వు, గొల్లపూడి సుబ్బారావు, ఎ.సుమతి, జి.సాయిబాబా, ఆర్.అంకారావు, ఆర్‌వీ.సురేష్‌బాబు, పి.శ్రీనివాసరావు, అయ్యన్న, ఎం.రామక్రిష్ణారెడ్డి, బీవీ.రమణారావు, సీహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### మద్దిపాడులో..

మద్దిపాడు: స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అబ్బూరి శేషగిరిరావు, ముత్తనపల్లి రామలింగయ్య, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, కడియాల రఘుబాబు, కాకర్ల విజయ్‌కుమార్, మండవ గోపీనాథ్, దేవబత్తిన ప్రసాద్, చింతల శ్రీనివాసరావు, పోకూరి శ్రీనివాసరావు, శుద్ధపల్లి అనిల్, నల్లూరి సంజీవరావు, రావిపాటి శేషయ్య, అద్దేపల్లి గంగాభవాని పాల్గొన్నారు. అనంతరం సెంటర్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మండవ జయంత్‌బాబు ప్రారంభించారు.

### ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు : సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆదివారం ఉప్పుగుండూరులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కాట్రగడ్డ చంద్రబాబు, బెల్లం వెంకటేశ్వర్లు, కనగాల శ్రీనివాసరావు, బి.సెల్వం, తెలగతోటి జాన్సన్, గద్దల రమేష్, పిన్నక శ్రీకాంత్, మసిముక్కు భాస్కర్, నల్లూరి భాస్కర్, బెల్లం శ్రీనివాసరావు, జాలాది సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### సింగరాయకొండలో..

టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కీర్తిశేషులు ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### పొన్నలూరులో..

పొన్నలూరులోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆపార్టీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచారు.

### జరుగుమల్లిలో..

జరుగుమల్లిలోని పార్టీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు,



జరుగుమల్లిలో నాయకుల ఆనందోత్సాహం

కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు, నాయకులు దగ్గుమాటి సుబ్బారెడ్డి, నరాల సోమయ్య, జీవీ, కొమ్మాలపాటి కృష్ణ, పూర్ణ పాల్గొన్నారు.

### టంగుటూరులో..

సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించాయి. మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. తూర్పునాయుడుపాలెంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఇరువురూ ప్రత్యేక పూజలు చేశారు. సీఎం చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్‌కట్ చేశారు. స్థానికులకు పుచ్చకాయలను, స్వీట్లను పంచారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్, పార్టీ నాయకుడు బెల్లం జయంత్‌బాబు పాల్గొన్నారు.

## ఎంపీ మాగుంటను కలిసిన లక్ష్మి



ఎంపీ మాగుంటకు బొకేను అందజేస్తున్న గొట్టిపాటి లక్ష్మి దంపతులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఆదివారం దర్శి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌కుమార్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక మాగుంట కార్యాలయంలో ఎంపీ మాగుంటను కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా మాగుంట ఆరోగ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దర్శి మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, ఏఎంసీ చైర్మన్ దానం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏఐబీఈఏ వ్యవస్థాపక దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న యూనియన్ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) 80వ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం ఒంగోలులోని మల్లయ్యలింగంభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒంగోలు ప్రాంతీయ అధికారి రవికుమార్, కెనరా బ్యాంకు ఒంగోలు ప్రాంతీయ అధికారి బి.రాఘవేందర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. బ్యాంకు ఉద్యోగుల హక్కులను సాధించేందుకు అసోసియేషన్ చేసిన కృషిని కొనియాడారు. అనంతరం ఆటల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, రిటైర్డ్ అధికారి పీకే.రాజేశ్వరరావు, పీడీబీఈసీసీ సెక్రటరీ రాజీవ్ రతన్‌దేవ్, అధ్యక్షుడు సుబ్బారావు, రామయ్య, ఉమాశంకర్, బ్రహ్మానాయుడు, షేక్ హుసేన్, బ్రహ్మయ్య, కృష్ణారెడ్డి, ఉమాపతి పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నేషనల్ లోకల్ గవర్నమెంట్స్ చాంబర్, గ్రామ స్వరాజ్య సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 24నుంచి 27వ తేదీ వరకు జరగనున్న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాల పోస్టర్‌ను ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆవిష్కరించారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నేషనల్ గవర్నమెంట్స్ చాంబర్ ప్రధాన కార్యదర్శి వీరభద్రాచారి మాట్లాడుతూ ఈ సదస్సుల్లో ముఖ్యఅతిథులుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, జడ్పీచైర్మన్, కలెక్టర్, డీపీవో, సీఈవో తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఒంగోలులో జాబ్ మేళా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కార్యాలయం అధికారి టి.భరద్వాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పలు కంపెనీలు పాల్గొంటున్నాయని, ఐటీఐ డిప్లమో, టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదువులు పూర్తి చేసిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జీతం నెలకు రూ.14వేల నుంచి రూ.18వేల వరకు ఉంటుందన్నారు. జిల్లాలోని 18నుంచి 40 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలతో హాజరుకావాలని, వివరాలకు 08592-281776 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

## సర్పంచ్ చెక్‌పవర్ పునరుద్ధరణకు ఉత్తర్వులు

కొండపి, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): పెదకండ్లగుంట సర్పంచ్ భువనగిరి సత్యన్నారాయణ చెక్ పవర్‌ను పునరుద్ధరించాలని హైకోర్టు ఇంటీరియమ్ ఉత్తర్వులు ఇచ్చింది. ఆమేరకు గ్రామ పంచాయతీ నిధులు డ్రాయింగ్ పవర్స్‌ను పునరుద్ధరించాలని డీపీవో జి.వెంకటనాయుడు ఈనెల 16వ తేదీన కొండపి మండల పరిషత్ అభివృద్ధి అధికారికి ఆదేశాలు జారీ చేశారు.

## ప్రాథమిక పాఠశాలలను పటిష్టపరచాలి

ఒంగోలు(రూరల్), ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం పటిష్టపరచాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ 1, 2 తరగతులను హైస్కూల్‌లో విలీనం చేవద్దని, గత వైసీపీ ప్రభుత్వంలో ఇప్పటికే హైస్కూల్‌లలో 3,4,5తరగతులను విలీనం చేసిందని చెప్పారు. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను పటిష్ట పరిచేందుకు 1 నుంచి 5వ తరగతులు ఒకే చోట ఉంచాలని కోరారు. హైస్కూళ్లలో ప్రాథమిక పాఠశాలలను విలీనం చేసే విధానం విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీజీ.కీర్తి, వై.శ్రీనివాసులు, బి.వెంకటరావు, ఎ.అమ్మయ్య, ఎన్.లక్ష్మీనారాయణ, బి.అశోక్‌కుమార్, ఎం.రాఘవరావు, పీవీసుబ్బారావులు పాల్గొన్నారు.

## మహిళల బీచ్ కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక



జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

సింగరాయకొండ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పాకల జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం మహిళల బీచ్ కబడ్డీ జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఈ సెలక్షన్ ప్రక్రియను జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ పిల్లి హజరతయ్య, ఎన్.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ జట్టు మే నెల 2వ తేదీ నుంచి 4 వరకు తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ డీవీఎస్ ప్రసాద్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, సెక్రటరీ పూర్ణ చంద్రరావు అభినందించారు.

## టీచర్ల కేటాయింపు ఒకేలా ఉండాలి

ఒంగోలు విద్య, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్కరణల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్న పాఠశాలలకు టీచర్ల కేటాయింపు ఒకే విధంగా ఉండాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ.కీర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.వెంకట్రావు, ఎన్.లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా అన్ని పాఠశాలలకు ఏకరీతిన టీచర్ పోస్టులు కేటాయించాలని, యూపీ స్కూళ్లలో స్కూలు అసిస్టెంట్లను కొనసాగించాలని వారు కోరారు.

## 92 మంది రక్తదానం



పండ్లను అందిస్తున్న శిద్దా హనుమంతరావు, వెంకటేశ్వరరావు

సంతనూతలపాడు, ఏప్రిల్ 20(ఆంధ్ర జ్యోతి): సంతనూతల పాడులోని పి.గుడిపాడు డొంకవద్ద గల క్రిష్ణసాయి గ్రానైట్స్‌లో ఆదివారం శిద్దా హనుమంతరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు రిమ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 92 మంది రక్తదానం చేశారు. 400 మందికి ఉచిత చికిత్సలను అందించారు. కీర్తి మెడికల్ యాజమాన్యం పండ్లు, ఎనర్జీ డ్రింక్‌ను అందజేశారు. కార్యక్రమంలో క్రిష్ణసాయి గ్రానైట్స్ చైర్మన్ శిద్దా వెంకటేశ్వరరావు, శిద్దా భరత్, కుటుంబసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉన్నతికి ప్రభుత్వం కృషి : మంత్రి



ప్రవల్లికకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి స్వామి

కొండపి, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కు అవసరమైన జేఈఈ, నీట్ ఉచిత కోచింగ్‌లు ఇచ్చి వారి ఉన్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. కొండపిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మొదటి సంవత్సరం విద్యార్థుల్లో అత్యధిక మార్కులు సాధించిన వారికి మంత్రి ఆదివారం కొండపిలో జరిగిన కార్యక్రమంలో ప్రోత్సాహక మెమొంటోలు అందజేశారు. మొదటి సంవత్సరం బైపీసీలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి అత్యధికంగా 429 మార్కులు సాధించిన కుంచాల ప్రవల్లిక, తర్వాత స్థానాల్లో 425 మార్కులు సాధించిన మోరపాకుల దివ్యశ్రీ, హెప్సీబాలకు, మొదటి సంవత్సరం సీఈటీ గ్రూపులో అత్యధికంగా 455 మార్కులు సాధించిన జి.షాదుల్లాకు మంత్రి స్వామి మెమొంటోలు అందజేసి అభినందించారు.

## వైభవంగా విగ్రహాల పునఃప్రతిష్ఠ

సంతనూతలపాడు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కామేపల్లివారిపాలెం గ్రామంలో ఆదివారం పోలేరమ్మతల్లి, పోతురాజుల విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వేదపండితులు శివయ్యశాస్త్రి ఆధ్వర్యంలో ప్రతిష్ఠ జరిగింది. అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, ఆరికట్ల సుమతి, నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

మద్దిపాడు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎస్సై బి.శివరామయ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం మద్దిపాడు కొష్టాలు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనం నడపవద్దని, వాహనానికి సంబంధించిన అన్ని ధృవపత్రాలు వెంట ఉండాలని చెప్పారు.

## ఘనంగా ఈస్టర్ వేడుకలు

● చర్చిల్లో భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు



ఒంగోలులోని చినపునీతమ్మ చర్చిలో ప్రత్యేక అలంకరణ

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. ఒంగోలులోని జువెట్ ప్రార్థన కొండపై సూర్యోదయ ఆరాధనలో సీనియర్ పాస్టర్ డి.జాన్‌అగస్టీన్, అదే వేదికపై అంతకముందు పాస్టర్ జాన్‌కెనడీ వాక్యోపదేశం చేశారు. ఇక జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో వేర్వేరుగా నిర్వహించిన ఈస్టర్ ఆరాధనలో పాస్టర్ ఆషేర్‌పాల్, జాన్ కెనడీ వాక్యోపదేశం చేశారు. మామిడిపాలెంలోని జువెట్ మెమోరియల్ సమాధుల తోటలో జరిగిన మృతుల జ్ఞాపకార్థ ప్రార్థనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇక సంజయ్‌గాంధీకాలనీలోని ది లార్డ్ చర్చిలో పాస్టర్ సురేష్, రామనగర్ నాజరేత్ జువెట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చిలో పాస్టర్ శ్యామేల్‌సన్, కబాడిపాలెంలోని రెవరెండ్ జి.భగవాన్‌దాసు వాక్యాన్ని బోధించారు. క్లౌపేటలోని ఐఈఆర్‌ఎఫ్, ఎష్కోలు ప్రార్థన మందిరం, మామిడిపాలెంలోని ఒలీవల ప్రార్థన కొండ, హోసన్నా, బైబిల్ మిషన్ ప్రార్థన మందిరం, పార్థన మందిరం తోపాటు పలు చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సందర్భంగా ఆలయాల్లో క్వయర్ బృందం ఏసుగీతాలు ఆలపించారు. తూర్పు క్రిస్టియన్‌పాలెం వద్ద క్రీస్తు పునరుత్థానం పురస్కరించుకుని ప్రత్యేక అలంకరణ, పునీత చిన్నతెరీసమ్మ చర్చిలో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

### నాగులుప్పలపాడు మండలంలో..



ఉప్పుగుండూరులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నాగులుప్పలపాడు: ఈస్టర్ వేడుకలను మండలంలోని క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఉప్పుగుండూరులోని ఎల్ఈఎఫ్ చర్చిలో పాస్టర్ ఏసుప్రసాద్ దైవ సందేశాన్ని ఇచ్చారు. బి.నిడమానూరు, ఈదుమూడి తెలుగు బాప్టిస్ట్ చర్చిలలో సంఘకాపరులు వినేష, రంజిత్‌కుమార్, అమ్మనబ్రోలు షకీనా మందిరంలో తేళ్ల ఐజక్ దైవసందేశం ఇచ్చారు.

### మద్దిపాడులో..

మద్దిపాడు: మండలంలోని అన్ని చర్చిలలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిపాడు తెలుగు బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెబ్బవరపు అబ్రహం, పెద్దకొత్తపల్లి చర్చిలో పాస్టర్ సుశాంతరావు, పాస్టర్ రెబ్బవరపు రాఘవరావు భక్తులకు ఈస్టర్ సందేశాన్ని అందించారు.

## మూడు గ్రావెల్ ట్రాక్టర్లు పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

మద్దిపాడు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. మండల పరిధిలోని పాతగార్లపాడు సమీపం నుంచి తెల్లబాడు గ్రామానికి మూడు ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ బి.శివరామయ్య అదుపులోకి తీసుకొని మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి సోమవారం తహసీల్దార్ ముందు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# హరిత హారం



కొండపిలోని వెల్‌నెస్ సెంటర్, హెల్త్ సెంటర్, రైతు సేవా కేంద్రాల పరిసరాల్లో పెంచిన అరటి, కొబ్బరి చెట్లు



అభయాంజనేయస్వామి ఆలయం వెనుక పెంచిన నేరేడు, ఉసిరి, వేప, చింతచెట్లు

## ప్రేమతో చెట్ల పెంపకం

## పుడమితల్లికి జీవం

## దాదాపు 200కు పైగా సంరక్షణ

## పర్యావరణానికి స్ఫూర్తిగా నిలుస్తున్న అభయాంజనేయస్వామి ట్రస్టు సభ్యులు

ఒక్క చెట్టును పెంచాలంటే ఎంతో కష్టపడాలి. అటువంటిది 200 చెట్లను పెంచుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు నీడను, పచ్చదనాన్ని అందిస్తున్నారు.. పుడమి తల్లికి జీవం పోస్తున్నారు అభయాంజనేయస్వామి ట్రస్టు సభ్యులు. కొండపికి చెందిన దాదాపు 50 మంది కామేపల్లి రోడ్డులో అభయాంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారు. దాని చుట్టూ పచ్చదనం కోసం మొక్కలు నాటారు. ఉచిత వాటర్ ప్లాంట్‌ను నిర్వహిస్తూ దాన్నుంచి వచ్చే వృథా నీటికి కుంటను ఏర్పాటు చేశారు. దాని ఆధారంగా 40 చెట్లను పెంచుతున్నారు. అదేవిధంగా అభయాంజనేయస్వామి ఆలయం సమీపంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, రైతు సేవా కేంద్రం, వెటర్నరీ వైద్యశాల పరిసరాల్లో దాదాపు 20కి పైగా అరటి, కొబ్బరి చెట్లను పెంచి సంరక్షిస్తున్నారు. అలాగే కొండపి నుంచి కట్టావారిపాలెం వెళ్లే రోడ్డులో అభయాంజనేయస్వామి ఆలయం ముందు కొబ్బరి, అరటి, వేప, ఇతర ఆకర్షణీయమైన చెట్లు దాదాపు 20 వరకు పెంచుతున్నారు. ఇదే రోడ్డులో వెదురు, కానుగ, వేప, చింత, నేరేడు, అత్తి, రావి తదితర అనేక జాతుల చెట్లు 50 వరకు పెంచారు. అభయాంజనేయస్వామి ఆలయంలో కూడా వివిధ రకాల పూజ, ఔషధ గుణాలున్న దాదాపు 50కి పైగా మొక్కలను గడచిన ఐదారేళ్లుగా పెంచి సంరక్షిస్తున్నారు. రోజూ ఎవరో ఒకరు అందుబాటులో ఉండి ఆయా చెట్లకు నీటిని అందిస్తున్నారు. వేసవిలోనూ ఏ ఒక్క చెట్టూ వాడుముఖం పట్టకుండా ప్రేమతో పెంచుతున్నారు. పచ్చదనాన్ని పరుస్తూ పర్యావరణ, ప్రకృతి ప్రేమికులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కొండపి గ్రామంలోలా అన్ని గ్రామాల్లోనూ పచ్చదనం పరిడవిల్లాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, కొండపి



కొండపి నుంచి కట్టావారిపాలెం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన పెంచిన వెదురు గూడులు



ఉచిత వాటర్‌ప్లాంటు ముందు పెంచిన కానుగ, ఆకర్షణీయమైన ఇతర జాతి చెట్లు




అభయాంజనేయస్వామి ఆలయం ముందు పెంచిన కొబ్బరి చెట్లు



వాటర్‌ప్లాంటు నుంచి వృథాగా వచ్చే నీటి ఆధారంగా పెంచిన చెట్లు

# పుట్టింటి నుంచి ఆలస్యంగా వచ్చిందని..

- భార్యను వేధిస్తూ..వెంబడించి దాడి
- అర్ధరాత్రి గొంతుమీద కాలుపెట్టి నులిమి హత్య
- పేర్నమిట్టలో ఓ మృగాడి దారుణం

ఒంగోలు క్రైం,ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): అనుమానం పెనుభూతంగా మారింది. భార్య ఒక్కరోజు పుట్టింటి నుంచి ఆలస్యంగా వచ్చినందుకు మరింత అనుమానం పెంచుకున్నాడు భర్త. భార్యను అత్యంత దారుణంగా గొంతుమీద కాలుపెట్టి నులిమి హత్యచేశాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి 2 గంటల సమయంలో ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని పేర్నమిట్టలో జరిగింది. వివరాలలోకి వెళితే పేర్నమిట్ట చెందిన దారా నవీన్ టంగుటూరు మండలం జమ్ములపాలెంనకు చెందిన శ్రావణిని పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి 10 ఏళ్ల బాలిక, 9 ఏళ్ల బాలుడు ఉన్నారు. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న నవీన్ పెళ్లి అయిన దగ్గర నుంచి భార్యపై అనుమానం పెంచుకున్నాడు. నిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడు.

గుడ్‌ఫ్రైడే సందర్భంగా శ్రావణి పుట్టినిల్లు అయిన జమ్ములపాలెంకు వెళ్లింది. అయితే అదే రోజు ఇంటికి తిరిగి రమ్మని నవీన్ ఆదేశించాడు. కానీ శ్రావణి మరుసటి రోజు పేర్నమిట్టకు వచ్చింది. దీంతో కోపోద్రిక్తుడైన భర్త నవీన్ శనివారం రాత్రి నుంచి హింసించడం ప్రారంభించాడు. ఆమెను పలు రకాలుగా ప్రశ్నిస్తూ.. వేధిస్తూ వెంబడించి దాడిచేశాడు. అర్ధరాత్రి దాటిన తరువాత శ్రావణి గొంతు పైన కాలు పెట్టి తొక్కాడు. ఆ సమయంలో ఆమె చెవుల నుంచి రక్తం కారింది. కొన ఊపిరితో ఉన్న ఆమెను చుట్టుపక్కల వారు 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. అక్కడ డాక్టర్లు పరిశీలించి శ్రావణి మృతి చెందిందని నిర్ధారించారు. ఈ మేరకు మృతురాలు తల్లి కె.భాగ్యమ్మ ఒంగోలు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శ్రావణి మృతదేహన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. శ్రావణి భర్త నవీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.



గొంతుపై కాలుపెట్టి నులమడంతో మృతిచెందిన శ్రావణి

# అధికారులంటే లెక్కలేదు..!

## స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సచివాలయ సెక్రటరీలు డుమ్మా

## నగర కమిషనర్ వెంకటేశ్వరరావు సీరియస్

## 29 మందికి మెమోలు

## మరి కొందరిపై వేటు..?

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పౌర సేవల్లోనే కాదు.. ప్రభుత్వ ఉన్నతాధికారులన్నా వారికి లెక్కలేదు. పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ప్రజాప్రతినిధులు పాల్గొనే సమావేశాలకు సైతం డుమ్మా కొట్టారు. ప్రత్యేకించి శనివారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో అందరూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే సచివాలయ సెక్రటరీలు డుమ్మా కొట్టారు. ఒంగోలు నగరపాలక సంస్థ, మెప్మా సంయుక్తంగా స్వచ్ఛతపై భారీ ర్యాలీ, అనంతరం సమావేశం నిర్వహించగా, ఆ కార్యక్రమానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తోపాటు, ప్రభుత్వ శాఖల అధికారులు సైతం మండుటెండలో పాల్గొన్నారు. అదేవిధంగా మెప్మా ఆర్పీలు, పొదుపు సంఘాల సభ్యులు, మెడికల్ కాలేజి విద్యార్థులు, పలు ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థులు, ఇతర ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతోనే సమావేశం కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్పొరేషన్ అధికారులు, మెప్మా అధికారులు ప్రత్యేక దృష్టి సారించినప్పటికీ, అందులో ముఖ్యపాత్ర పోషించి, బాధ్యతగా వ్యవహరించాల్సిన సచివాలయ సెక్రటరీలు మాత్రం ముఖం చాటేశారు. ఈ విషయాన్ని గుర్తించిన నగర కమిషనరు వెంకటేశ్వరరావు సీరియస్ అయినట్లు సమాచారం. కార్యక్రమం ప్రారంభం అయినప్పటి నుంచి ముగిసే వారకు సచివాలయ సెక్రటరీలు, నోడల్ ఆఫీసర్లు, పలు సెక్షన్ల అధికారులు, పలువురు ఉద్యోగులు పాల్గొనాలని కమిషనరు ముందురోజే ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా హాజరైన ప్రతి ఒక్కరూ సంతకాలు చేయాలని కమిషనరు తెలిపారు. ఇంతవరకు బాగానే ఉన్నా, అక్కడకు విచ్చేసిన కొందరు సెక్రటరీలు పీవీఆర్ బాలుర స్కూలు వద్ద వద్ద ర్యాలీ ప్రారంభం కాగానే అక్కడ నుంచి జారుకున్నట్లు అధికారులు గుర్తించారు. దాంతో కమిషనరు మరింత ఆగ్రహం వ్యక్తం చేసి, 29 మంది సెక్రటరీలకు మెమోలు జారీ చేయగా, సమావేశానికి హాజరు కాని వారి వివరాలు తెలిజేయాలని కమిషనరు కార్యాలయ మేనేజర్ శ్రీహరిని ఆదేశించారు. అలాగే సమావేశానికి హాజరు కాకుండానే హాజరు అయినట్లు చెప్పుకుంటున్నవారు సమావేశంలో పాల్గొన్నట్లు ఆధారాలతో వివరణ ఇవ్వాలని సూచించారు. మొత్తంగా సచివాలయ సెక్రటరీల బాధ్యతా రాహిత్యంపై సీరియస్‌గా ఉన్న కమిషనరు శాఖపరంగా చర్యలకు సిద్ధం అయ్యారు.



ఒంగోలులో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీ (ఫైల్)

### బాధ్యత లేని సెక్రటరీలపై చర్యలు

- కమిషనర్ వెంకటేశ్వరరావు

నగర కమిషనరు వెంకటేశ్వరరావు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఒంగోలులో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి జిల్లా స్పెషలాఫీసర్, మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్, ఒంగోలు ఎమ్మెల్యే, ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులందరూ హాజరయినా, సచివాలయ సెక్రట రీలు హాజరు కాకపోవడాన్ని గుర్తించాము. వారి బాధ్యత రాహిత్యంపై కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధం అయ్యాము. ఇప్పటికే 29 మందికి మెమోలు జారీ చేశాము. మిగిలిన వారికి కూడా జారీ చేస్తున్నాము.

# శ్రీమహావిష్ణువుగా చెన్నయ్య

గరుడ వాహనంపై శ్రీమహావిష్ణువు అవతారంలో విహరిస్తున్న చెన్నయ్య





శ్రీలక్ష్మీ సమేత మహావిష్ణువు అలంకారంలో కళాకారులు

## చెన్నకేశవ నామ స్మరణతో మార్మోగిన మార్కాపురం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆదివారం శ్రీ మహావిష్ణువు అలంకారంలో గరుడ వాహనంపై నాలుగు మాడవీధులలో విహరించారు. వాహనాలలో అతి ముఖ్యమైన గరుడ వాహనం దర్శించిన వారికి విజయం, కీర్తి, బలం సిద్ధిస్తాయని ఆలయ ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యులు తెలిపారు.

తెల్లవారుజామున 3గంటలకు చెన్నకేశవుని మహావిష్ణువు అలంకారంలో సర్వాలంకరణ భూషితడను చేసి గరుడ వాహనంపై ఆశీనులను చేశారు. భేరీవాయిద్యాలు, వరంగల్ మహిళల తప్పెట్లు, వికాస తరంగిణి మహిళా సమాజం భక్తి గీతాలు, కళాకారుల వేషధారణలు, మహిళా కోలాట బృందాలు, మంగళవాయిద్యాలు, బాణసంచాల సందడి మధ్య నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబులు వాహన సేవలో పాల్గొన్నారు. ఉత్సవకమిటీ అధ్యక్షులు యక్కలి కాశీవిశ్వనాథం, ఈవో జి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

### నేడు గజ వాహనం, రథోత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం తెల్లవారుజామున చెన్నకేశవస్వామి గజవాహనంపై సార్వభౌమ అలంకారంలో నాలుగు మాడవీధులలో విహరించనున్నారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేతుడై రథోత్సవంలో విహరించనున్నారు.

చెన్నకేశవుడి నగరోత్సవాన్ని తిలకించేందుకు తరలి వచ్చిన భక్తులు





వరంగల్ మహిళా కళాకారుల తప్పెట్లు



# ఘనంగా వీరాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- టీడీపీ ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభల ఏర్పాటు

బల్లికురవ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలమవారిపాలెం గ్రామ సమీపంలో ఉన్న వీరాంజనేయస్వామి 38వ వార్షిక తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగింది. వీరాంజనేయస్వామి వారిని వెలమవారిపాలెం, కొత్తూరు, మైలవరం గ్రామాలకు చెందిన భక్తులు దర్శించుకొని మొక్కుబడి పొంగళ్లు సమర్పించారు. ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, ఆకు పూజలు జరిగాయి. ఈసందర్భంగా దాతల సహకారంతో పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. వీరాంజనేయస్వామి తిరునాళ్లలో వెలమవారిపాలెం, కొత్తూరు గ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. తిరునాళ్లలో బల్లికురవ ఎస్ఐ వై. నాగరాజు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.





టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ, పక్కన పొంగళ్లు పెడుతున్న భక్తులు



పూజలందుకున్న వీరాంజనేయస్వామి

## అవీ.. ఇవీ

### పాఠశాలల విలీనాన్ని విరమించుకోవాలి

గిద్దలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): హైస్కూళ్లలో ప్రాథమిక తరగతుల విలీనాన్ని విరమించుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గిద్దలూరులో జరిగిన ఏపీటీఎఫ్ సర్వసభ్య సమావేశంలో యూనియన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసులు మాట్లాడారు. రాష్ట్రంలోని 900 ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను ఇప్పటికే విలీనం చేసిందన్నారు. అయితే 1, 2 తరగతులను హైస్కూలులో విలీనం చేస్తామని విద్యాశాఖ పేర్కొనడం సమంజసంగా లేదన్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ 1, 2 తరగతులను కూడా హైస్కూళ్లలో విలీనం చేస్తాననడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. 1, 2 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేస్తే ప్రాథమిక విద్యావ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందన్నారు. దశల వారిగా ప్రాథమిక పాఠశాలలు కనిపించకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విలీనం ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అదనపు కార్యదర్శి కబీర్, జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగస్వామి, జిల్లా కార్యదర్శి పాండు, గిద్దలూరు, కొమరోలు మండలశాఖ అధ్యక్షులు దేవసహాయం, పిచ్చయ్య పాల్గొన్నారు.

### పిల్లలపై నిఘా ఉండాలి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లలపై తప్పనిసరిగా తల్లిదండ్రులు నిఘా ఉంచాలని అర్బన్ సీఐ సురేష్ తెలిపారు. ఇటీవల పిల్లలకు వేసవి సెలవులు ఇచ్చిన నేపథ్యంలో తమ పిల్లలను అనవసరంగా ఎండకు తిప్పకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని, మీ ప్రాంతాలలో ఉన్న చెరువులు, బావులు, కుంటలలో పిల్లలు ఈతకు వెళ్ళకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలన్నారు.

### ఆర్థికసాయం అందజేత

గిద్దలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): లివర్ సమస్యతో బాధపడుతున్న చిన్నారి కుటుంబానికి పట్టణంలోని స్ప్రింగ్ బోర్డు పాఠశాల యాజమాన్యం రూ.15వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేసింది. కంభం మండలం లింగాపురం గ్రామానికి చెందిన చిన్నారి అశ్విత లివర్ సమస్యతో బాధపడుతూ ఆపరేషన్ కోసం లక్షలు ఖర్చు పెట్టలేక తల్లిదండ్రులు ఇబ్బందుల్లో ఉండగా తమవంతు సాయంగా స్ప్రింగ్‌బోర్డు పాఠశాల యాజమాన్యం సాయం అందించింది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మణిచైతన్య, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

గిద్దలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కే.ఎస్.పల్లి గ్రామంలో వెలసిన శ్రీపోలేరమ్మ దేవస్థానంలో 6వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలలో భాగంగా తొలిరోజు ఆదివారం ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అభిషేకం చేశారు. సాయంత్రం సామూహికంగా జరిగిన కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భరతనాట్య ప్రదర్శన అందరిని ఆకట్టుకొంది. అనంతరం మహిళలకు పట్టుకుంటే పట్టుచీర లక్కీడిప్ ద్వారా పట్టుచీరలు అందచేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్త అంబటి బాలిరెడ్డి, గ్రామపెద్దలు ఆయా పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

### ముగిసిన చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో వేంచేసిన శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామివారి బ్రహ్మోత్సవాలు పదో రోజు ఆదివారంతో ముగిశాయి. ఆలయ అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు ఆధ్వర్యంలో ప్రతి రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు భక్తులకు ప్రతి రోజు ఒక్కో రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

### చలివేంద్రాలు ఉపయోగకరం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక నెహ్రూ బజార్‌లోని షిరిడీ సాయి మందిర సభ్యుల ఆధ్వర్యంలో కంభం రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో షిరిడిసాయి మందిర అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, హరిహరరావు, నాగరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రధానోపాధ్యాయుడికి సన్మానం


ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న రెడ్ క్రాస్ మానవతా సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే ఎన్‌రోల్‌మెంట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచిన జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డిని రెడ్ క్రాస్ సొసైటీ, మానవతా స్వచ్చంద సేవాసంస్థ సభ్యులు శనివారం సన్మానించారు. 2024-25 సంవత్సరంలో జిల్లాలో ఉన్నా అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంటే అత్యధికంగా పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులందరిలో మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచిందని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీనివాసరెడ్డి, గుంటక చెన్నారెడ్డి, ఆర్‌కేజే నరసింహం పాల్గొన్నారు.

### వక్ఫ్‌చట్టంతో ముస్లింలకు న్యాయం

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్యాణ్ చక్రవర్తి**

పొదిలి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్‌చట్టం ద్వారా ముస్లింలకు న్యాయం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిడమనూరి కల్యాణ్ చక్రవర్తి అన్నారు. ఆదివారం బీజేపీ నాయకులతో కలిసి వక్ఫ్ చట్టం వివరణ పత్రాన్ని అవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వక్ఫ్ అనేది ఇస్లామిక్ చట్టం ద్వారా తిరిగివ్వలేని దాతృత్వనిధి అన్నారు.




మార్కాపురంలో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, గిద్దలూరులో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, వై.పాలెంలో జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు

## ఘనంగా చంద్రబాబు జన్మదినోత్సవం

- మార్కాపురం, గిద్దలూరులో కేకు కట్ చేసిన ఎమ్మెల్యేలు నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి
- పలుచోట్ల సేవా కార్యక్రమాలు

మార్కాపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర నిర్మాత చంద్రబాబునాయుడు అని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75 పుట్టిన రోజు వేడుకలను మార్కాపురంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్వీకేపీ కాలేజీలో జరుగుతున్న పశుబల ప్రదర్శన వేదిక వద్ద ముందుగా భారీ కేక్‌ను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కట్ చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలకు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం 75 ఏళ్ల వయసులో యువతరం పోటీ ఎడుతూ శ్రమిస్తున్న ముఖ్యమంత్రి దేశంలో చంద్రబాబు ఒక్కరే అన్నారు. నేటి యువతరానికి ఆయన జీవనశైలి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, వక్కలగడ్డ మల్లికార్జున్, తాళ్లపల్లి సత్యనారాయణ, గుంటక సుబ్బారెడ్డి, షేక్ మౌలాలి, మాలపాటి వెంకటరెడ్డి, కొప్పుల శ్రీనివాసులు, కౌన్సిలర్ నాలి కొండయ్య, మట్టం వెంకటేశ్వర్లు, జవ్వాజి రామాంజులరెడ్డి, పఠాన్ హుసేన్‌ఖాన్ పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం చంద్రబాబునాయుడు పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని అన్నాక్యాంటీన్ వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను ఏర్పాటు చేసి పార్టీ శ్రేణులతో, కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే కట్ చేశారు. టీడీపీ శ్రేణులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్, సైబరాబాద్ వంటి మహా నగరాలను అభివృద్ధి చేసి ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిపిన ఘనత ముఖ్యమంత్రి చంద్ర బాబుదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబు, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, మండల, పట్టణ పార్టీల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, సయ్యద్ షానేషావలి, టీడీపీ నాయకులు బైలడుగు బాలయ్య, దప్పిలి భాస్కర్‌రెడ్డి, దుత్తా బాలీశ్వరయ్య, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పార్టీలోని వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

కంభం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలు కంభం మండల టీడీపీ అధ్యక్షులు తోట వెంకటశ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 4వ పర్యాయం ముఖ్యమంత్రిగా చేస్తున్న చంద్రబాబునాయుడు విజన్ అద్భుతమన్నారు. కార్యక్రమంలో మండలంలోని టీడీపీ సీనియర్ నాయకులను సన్మానించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**అర్ధవీడు మండలంలో..**

అర్ధవీడు మండల టీడీపీ అధ్యక్షులు బండ్లమూడి అంజనేయులుయాదవ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు పురుషోత్తంరెడ్డి, సుధాకర్, నారాయణరెడ్డి, రమణయాదవ్, శ్రీనివాస రెడ్డిలు చంద్రబాబునాయుడు చేస్తున్న సేవలను గుర్తు చేశారు.

పుల్లలచెరువు : సీఎం చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా టీడీపీ నాయకులు పుల్లలచెరువు బస్టాండ్ కూడలిలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. మంచి ఆరోగ్యంతో ఆయన రాష్ట్రంలో పాలన సాగించాలని కోరారు. సాయంత్రం కవలకుంట్ల గ్రామంలో టీడీపీ యువత ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణరెడ్డి, మేడికొండ లక్ష్మినారాయణ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : చంద్రబాబునాయుడి జన్మదినం సందర్భంగా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, షేక్ సమ్మద్ భాష, చంటి, షేక్ మంజూర్ భాష, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ పుట్టిన రోజు వేడుకలు ఎర్రగొండపాలెం మండలం వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండలంలోని వీరభద్రాపురం, అమానిగుడిపాడు, బోయలపల్లి, మొగుళ్లపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాలలో నాయకులు కేక కట్ చేసి బాణాసంచి కాల్చి సంబరాలు జరుపుకున్నారు. మిల్లింపల్లిలోని రాళ్లవాగు సమీపంలో ఉన్న మానసిక దివ్యాంగులకు అవసరమైన నిత్యవసర సరుకులను నాయకులు పాల్గొని పంపిణి చేశారు. ఆయా కార్యక్రమాలలో మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, పెరుమాళ్ల మల్లికార్జున, చీదెళ్ల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు : సీఎం చంద్రబాబునాయుడి జన్మదినం సందర్భంగా తర్లుపాడు బస్టాండ్ కూడలిలో భారీ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి పి.గోపినాథ్ చౌదరి, కె.శ్రీనివాసులు, ఈ.వెంకటయ్య, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు నాయకులు పాల్గొన్నారు.

బేస్తవారపేట : బేస్తవారపేటలో గ్రంథాలయంలో, మెయిన్‌రోడ్డులో బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, గ్రంథపాలకుడు వీవీ.సుబ్బారెడ్డి,పూనూరు భూపాల్‌రెడ్డి, గుంటక నరశింహ, డి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : పట్టణంలోని పెద్దబస్టాండ్, బీజేపీ కార్యాలయం, కాటూరివారిపాలెం గ్రామాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. పెద్దబస్టాండ్, కాటూరివారిపాలెం గ్రామాల్లో ఉన్న ఎన్టీఆర్, కాటూరి నారాయణ స్వామి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారీకేక్‌లను కట్‌చేసి అభిమానులకు, కార్యకర్తలకు పంచిపెట్టి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మండల, పట్టణ అధ్యక్షులు ఓబులరెడ్డి, ముల్లా ఖుద్దూస్, టీడీపీ నాయకులు ఇంమాం సాహెబ్, ఆవులూరి యలమంద, రసూల్, గౌస్‌భాష పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం రాష్ట్రముఖ్యమంత్రి కార్యాలయంలో ఘనంగా నిర్వమించారు. . టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు బర్త్‌డే కేక్ కట్ కార్యకర్తలకు పంపిణీ చేశారు. వెలిగొండ పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటు చంద్రబాబు నాయుడితోనే సాధ్యమన్నారు. టీడీపీ మండల నాయకులు శనగా నారాయణరెడ్డి, గోళ్లసుబ్బారావు, కొత్తమాసు సుబ్రహ్మణ్యం, నలగాటి చిన్న మల్లికార్జుననాయుడు, నలగాటి చిన్న మల్లికార్జు నాయుడు; చిట్యాల వెంగళరెడ్డి, పాల్గొన్నారు.





పుల్లలచెరువు, కంభంలో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, పొదిలిలో ఎన్‌టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు, వై.పాలెంలో దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

## సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక పశుప్రదర్శన

**ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**

మార్కాపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల రైతుల సంస్కృతి, సంప్రదాయాలకు పశుప్రదర్శనలు ప్రతీకలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఎస్వీకేపీ కళాశాలలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతీయస్థాయి పశుప్రదర్శన పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషకులు ఎంతో వ్యయప్రయాసల కోర్చి పోటీల్లో పాల్గొనేందుకు దూరప్రాంతాల నుంచి వస్తున్నారన్నారు. వారికి నగదు బహుమతి రూపంలో ఎంత ఇచ్చిన తక్కువే అన్నారు. పశువుల పట్ల రైతాంగానికి ఉండే అనుబంధంతోనే ఎంతో ఖర్చుతో కూడుకున్నదైనా వాటిని పోషిస్తున్నారన్నారు. భవిష్యత్తులో కూడా భారీ ఎత్తున పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల కుమార్తె నందినిరెడ్డి పోటీల్లో పాల్గొన్న ఎడ్ల యజమానులను సన్మానించి, కొద్దిసేపు బండను లాగించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, తూర్పువీధి బండకమిటీ నిర్వాహకులు మాలపాటి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నంద్యాల జిల్లా ఎడ్లు సత్తా**

చివరిరోజు సీనియర్ సైజు విభాగంలో పోటీలు ఉదయం, సాయంత్రం వేళల్లో జరి గాయి. ఈ పోటీల్లో నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం గుంపరమానుదిన్నె గ్రామానికి చెందిన కుందూరు రామ్‌భూపాల్ రెడ్డికి చెందిన ఎడ్లజత 2,310 అడుగుల దూరం బండలాగి ప్రథమ స్థానంలో నిలిచింది. మొదటి బహుమతిగా రూ.1.20 లక్షలను దాత ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఎడ్ల యజమానికి అందజేశారు. అదేవిధంగా రెండవ స్థానంలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన ఆర్‌ఆర్ బుల్స్ ఎడ్లజత 2,117 అడుగుల దూరం బండనులాగి నిలిచింది. ద్వితీయ బహుమతిగా రూ.90 వేలను బోయలపల్లి పోలిరెడ్డి యజమాని డి.రోహన్‌బాబుకు అందజేశారు. మూడవ స్థానంలో అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఎమ్.రమేష్‌బాబు, వైఎంఆర్ కాలనీకి చెందిన గురివిరెడ్డిల ఎడ్ల జత 2,056 అడుగుల దూరంలాగి నిలిచింది. వీరికి బహుమతిగా రూ.70 వేలను గొలమారి వెంకటరెడ్డి అందించారు. బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరస్వామి చౌదరికి చెందిన ఎడ్ల జత 2,004 అడుగుల దూరం బండనులాగి నాలుగవస్థానంలో నిలిచింది. నగదు బహుమతి రూ.50 వేలను బోరెడ్డి రాజారెడ్డి అందజేశారు. నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్.కొత్తూరుకు చెందిన బోనం సుబ్రహ్మణేశ్వరరెడ్డి, సిరివెళ్ల మండలం గుంపరమానుదిన్నె గ్రామానికి చెందిన కుందూరు రామ్‌భూపాల్‌రెడ్డిల కంబైన్డ్ ఎడ్లజత 2,001 అడుగుల దూరం బండనులాగి ఐదవస్థానంలో నిలిచింది. బహుమతిగా రూ.30 వేలను దాత మారెళ్ల చెన్నారెడ్డి, సముద్రాల కిషోర్‌కుమార్‌ల నుంచి అందుకున్నారు. మార్కాపురం మండలం బొడిచెర్లకు చెందిన తిండి నక్షత్రారెడ్డి ఎడ్లజత 1,816 అడుగులు బండనులాగి ఆరవస్థానంలో నిలిచి రూ.20 వేల నగదు బహుమతిని దాత మారంరెడ్డి రామకృష్ణారెడ్డి నుంచి అందుకున్నాయి. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఎడ్లజత యజమానికి జ్ఞాపికను డాక్టర్ కందుల రాజశేఖర్‌రెడ్డి అందించారు.


బండలాగుతున్న ఎడ్లజత

### ఇరువర్గాల మధ్య ఘర్షణ

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన ఇరు వర్గాల మధ్య ఇటీవల కాలంలో మనస్పర్థలు ఏర్పడి చివరకు కత్తులు, గొడ్డళ్లతో దాడి చేసుకున్నారు. దీంతో నలుగురికి గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు అర్బన్ కాలనీలోని రాము, ధన్‌రాజ్ వర్గాల మధ్య మనస్పర్థలు ఏర్పడి గొడవలు జరుగుతున్నాయి. దీంతో కులపెద్దలు దీనిని పరిష్కరించేందుకు ఆదివారం కొండపేట ఆంజనేయస్వామి గుడి సమీపంలో సమావేశమ్యారు. గొడవను కులపెద్దలు సరి చేస్తున్న సమయంలో ధన్‌రాజ్, రాము వర్గాలకు చెందిన వ్యక్తులు కత్తులు, గొడ్డళ్ళతో దాడికి దిగారు. దాదాపు పది మందికి గాయాలు కాగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



### కూరగాయల వ్యాపారుల సిండికేట్ తగదు

**సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సోమయ్య**


మూతపడిన కూరగాయల దుకాణాలు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో పట్టణంలోని కూరగాయల మార్కెట్, హోల్‌సెల్ వ్యాపారులు సిండికెట్‌గా మారి షాపులు మూసివేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.సోమయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్కాపురంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి తిరునాళ్ల జరుగుతున్న సందర్భంగా లక్షలాది రూపాయలకు వేలంపాట నిర్వహించి షాపులు మూసివేసి అధిక ధరలకు కూరగాయలు అమ్మడంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. తిరునాళ్లకు సంబంధించి మార్కాపురంలో వివిధ ప్రాంతాల నుంచి బంధువులు, స్నేహితులు వచ్చి మూడురోజుల పాటు ఉండి స్వామివారి ఉత్సవాలను తిలకిస్తారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కూరగాయల వ్యాపారులు లక్షలాది రూపాయలకు వేలంపాట నిర్వహించి 1, 2 షాపులు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంచారన్నారు. మిగిలిన దుకాణాలు మూసివేశారన్నారు. ఆయా దుకాణాల్లో అధిక ధరలకు కూరగాయలు విక్రయిస్తున్నారన్నారు. 20, 21, 22 తేదీల్లో కూరగాయల ధరలను భారీగా పెంచి విక్రయిస్తున్నారన్నారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

### ప్రతి విద్యార్థికి 'తల్లికి వందనం' : ముత్తుముల

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే ప్రతి విద్యార్థికి కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద రూ.15వేల అందిస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్‌ప్లాజా నందు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్స్ (అపుస్మా) జిల్లా కార్యవర్గ సమావేశం జరుగగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడారు. తల్లికి వందనం పథకం జూన్ నెలలో జమ అవుతుందని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రైవేటు స్కూల్స్ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నాయని, తమ ప్రభుత్వం విద్యావ్యవస్థలో మార్పుల కోసం మానవ వనరుల మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కె.మాధవరావు మాట్లాడుతూ ప్రైవేటు స్కూల్ యజమాన్యాలు ఐక్యతతో ముందుకు సాగి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో గిద్దలూరు ప్రాంత అధ్యక్షులు పి.సుధీర్‌కుమార్‌రెడ్డి, రీజనల్ అధ్యక్షులు ఏ.వీ.సుబ్బారావు, జిల్లా గౌరవాధ్యక్షులు బి.హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి జి.మల్లికార్జునరెడ్డి, ట్రెజరర్ ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి, స్టేట్ జాయింట్ సెక్రటరీ ఖాజావలి, ప్రధాన కార్యదర్శి జె.చంద్రశేఖర్, ట్రెజరర్ కె.గణేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

**సరస్వతీదేవి విగ్రహ ఆవిష్కరణ**

మండలంలోని కొంగళవీడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్ఠ జరుగగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. హెచ్ఎం ఎల్.వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పూలమాల, శాలువా వేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుప్పా రంగసాయి, బీజేపీ పట్టణ పార్టీ అధ్యక్షులు అబ్బిశెట్టి ఉదయ్‌శంకర్, దుత్తా బాలీశ్వరయ్య పాల్గొన్నారు.

### చెన్నయ్యకు మోహినీ ఉత్సవం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం రాత్రి చెన్నకేశవ స్వామికి మోహిని అలంకారంలో నగరోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు.

**అన్నప్రసాద వితరణ**

శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో గడియార స్తంభం వద్ద ఆదివారం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. దాత పద్మాలక్ష్మీ, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు గుంటక సుబ్బారెడ్డి, రామిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా పెద్దమ్మతల్లి తిరునాళ్ల

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మునూరు గ్రామంలో పెద్దమ్మతల్లి తిరునాళ్ల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆదివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్నాటి రామసుబ్బారెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

### యల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి). మండలంలోని గోగులదిన్నె గ్రామంలో రేణుక యల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిఖర కలశ, నూతన విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమం వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామస్థులకు అన్నదానం చేశారు. ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితోపాటు టీడీపీ నియోజకవర్గ నాయకుడు కందుల రామిరెడ్డి, నాయకులు పాల్గొని యల్లమ్మ తల్లి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు వేల సంఖ్యలో పాల్గొన్నారు.

### కొట్టాలపల్లిలో రాములవారి ప్రతిష్ఠ


పట్టాభిరామస్వామి

మండలంలోని కొట్టాలపల్లి గ్రామంలో శ్రీ పట్టాభి రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్ర మం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో రాములవారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిపించారు. స్వామి వారి ఉత్సవంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ ప్రతిష్ఠ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

ముఖాముఖి

## సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలకు అడ్డుకట్ట

**కె.కమలాకర్, ఎస్ఐ, ముండ్లమూరు**



ప్రశ్న: మండలంలో దొంగతనాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**జవాబు:** మండలంలో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. ప్రజాప్రతినిధులు సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశాం. వీటిద్వారా నిందితులను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నాం.

ప్ర: మండలంలో గేదెలు దొంగతనాలు ఎక్కువగా జరిగాయి, పురోగతి సాధించారా?

**జ:** ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. పాత నేరస్తులపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. త్వరలోనే దొంగతనాలకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుంటాం.

ప్ర: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**జ:** మండలంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రతిరోజు వాహనాలను తనిఖీ చేస్తున్నాం. సంబంధిత పత్రాలులేని వారికి అపరాధ రుసుం విధిస్తున్నాం.

ప్ర: పల్లె నిద్రతో ప్రజలకు ఎలాంటి భరోసా కల్పిస్తున్నారు?

**జ:** నెలకు రెండు గ్రామాల్లో పల్లెనిద్ర చేస్తున్నాం. ప్రజలతో సమావేశమై గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులు తెలుసుకుంటున్నాం. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను తెలుసుకుంటున్నాం.

### చింతలపూడి విద్యార్థికి జేఈఈ మెయిన్స్‌లో 1800 ర్యాంకు



ముండ్లమూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు పంచాయతీ పరిధిలోని చింతలపూడి గ్రామానికి కోయ రెశ్వంత్ జేఈఈ మెయిన్స్‌లో 1800 ర్యాంకు సాధించాడు. ఈడబ్ల్యూఎస్ విభాగంగా 157వ ర్యాంకు వచ్చింది. గ్రామానికి చెందిన కోయ సుబ్బారావు, రమాదేవి కుమారుడు రెశ్వంత్ విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ చదివాడు. తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో తల్లి రమాదేవి కష్టపడి కుమారుడిని చదివించింది. పేదింటి బిడ్డ మంచి ర్యాంకు సాధించటంతో గ్రామస్థులు అభినందించారు.

### టీడీపీ కార్యకర్త మృతి

దొనకొండ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): దొనకొండ ముస్లిం బజారుకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త, సీఎం చంద్రబాబు వీరాభిమాని షేక్ ఖాదర్ వలి(78) అనారోగ్యంతో ఆదివారం తన స్వగృహంలో మృతిచెందాడు. పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా విశిష్ట సేవలందిస్తూ సీఎం చంద్రబాబుకు వీరాభిమానిగా ప్రజల్లో గుర్తింపు పొందాడు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, మోడి ఆంజనేయులు, కొమ్మతోటి సుబ్బారావు, షేక్ సద్దాం, మస్తాన్, తదితరులు ఖాదర్‌వలి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### ఎంపీ మాగుంటకు పరామర్శ

దర్శి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిని ఒంగోలులోని ఆయన నివాసంలో ఆదివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, అతితక్కువ కాలంలో పూర్తి ఆరోగ్యంతో రావటంపట్ల ఆనందం వ్యక్తం చేశారు. వారి వెంట సంగా తిరుపతిరావు, దారం సుబ్బారావు, కౌన్సిలర్ వీసీ రెడ్డి తదితరులు ఉన్నారు.

# రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు ఎనలేని కృషి

» **ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి**



సీఎం చంద్రబాబు పుట్టినరోజు కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో 75కేజీల భారీ కేకును కట్ చేసి నాయకులకు, శ్రేణులకు పంచిపెట్టారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు వంటివారని అన్నారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం అలుపెరగని కృషి చేస్తున్నారన్నారు. ఆయన సారథ్యంలో పని చేయటం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో మరో పాతికేళ్ళు వెనక్కుపోయిందన్నారు. ఈతరుణంలో ప్రజలు చంద్రబాబుపై విశ్వాసంతో గెలిపించుకున్నారన్నారు. ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని వమ్ము చేయకూడదనే సంకల్పంతో వయసును కూడా ఖాతరు చేయకుండా 25ఏళ్ళ యువకుడిలా కష్టపడుతున్నారన్నారు. ఆయన పాలనలో తిరిగి రాష్ట్రం గాడిలో పడి అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భేరి పుల్లారెడ్డి, వీవీఆర్ మనోహరరావు, తమ్మినేని శ్రీనివాసరెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, రోషన్‌సంధాని, జనసేన నాయకుడు వరికూటి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

**పామూరులో..** పామూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన కేకును కట్‌చేసి, ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, ఉప్పలపాటి హరిబాబు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కంభాలదిన్నె, వగ్గంపల్లి, రావిగుంటపల్లి గ్రామాల్లో చంద్రబాబు జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేశారు. సీఎస్‌పురం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన జన్మదిన వేడుకల్లో బొమ్మనబోయిన వెంగయ్య, బొబ్బూరి రమేష్, ఎన్‌సీ మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

**పీసీపల్లిలో..** పీసీపల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు జన్మదిన సందర్భంగా మండలంలోని పీసీపల్లి, మారెళ్ల, పెదయిర్లపాడు, నేరేడుపల్లి తదితర గ్రామాల్లో కేకు కట్‌చేసి శ్రేణులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య, ఏనుగంటి చిన్నా, ములకా నాగేశ్వరరావు, ఏనుగంటి బాబు, తదితరులు పాల్గొన్నారు.

# పాడి పరిశ్రమపై రైతుల ఆసక్తి

» **మినీ డెయిరీలకు చేయూతనిస్తున్న బ్యాంకులు**

» **ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత అభివృద్ధి**



మినీ డెయిరీలో ఉన్న ఆవులు

ముండ్లమూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాడి పరిశ్రమపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా డెయిరీలతో ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. దీంతో పాటు పలువురికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. అటు ప్రభుత్వం, ఇటు బ్యాంకుల ప్రోత్సాహంతో పాడి పరిశ్రమను పరుగులు తీయిస్తున్నారు. మినీ డెయిరీలను ఏర్పాటుచేసుకొని పలువురు రైతులు ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో సన్న, మధ్య తరగతి రైతులు మినీ డెయిరీలను ఏర్పాటుచేసుకొని లాభాలు గడిస్తున్నారు. మండలంలో 38 డెయిరీలు ఉన్నాయి. ఆవులు, గేదెలు ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసి డెయిరీలను నిర్వహిస్తున్నారు. 150 లీటర్ల నుంచి ఐదు వందల లీటర్ల వరకు పాలను తీస్తూ వివిధ ప్రాంతాల్లో ఉన్న డెయిరీలకు విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. డెయిరీల ఏర్పాటువల్ల కుటుంబం ఆర్థికాభివృద్ధి చెందుతూ పిల్లల చదువులు కూడా కొనసాగిస్తూ ముందుకు సాగుతున్నారు.

మండలంలో సింగనపాలెం, చంద్రగిరి, ముండ్లమూరు, పసుపుగల్లు, తమ్మలూరు, వేంపాడు, చింతలపూడి, పెద ఉల్లగల్లు గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో మినీ డెయిరీలను నిర్వహిస్తున్నారు. సరాసరి రెండు వందల నుంచి నాలుగు వందలు గేదెలు ఉన్న పశుపోషకుడికి నెలకు ఖర్చులు పోను సరాసరి రూ.1.50 లక్షల వరకు ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను దర్శి, అద్దంకి, తాళ్ళూరు, ముండ్లమూరులతో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న డెయిరీలకు పాలు విక్రయిస్తున్నారు.

**బ్యాంకుల చేయూత**

మండలంలో మినీ డెయిరీలకు బ్యాంకులు అండగా నిలుస్తున్నాయి. విరివిగా రుణాలు అందజేస్తున్నారు. మినీ డెయిరీలు ఏర్పాటు చేసుకున్న పశు పోషకులకు మరింత కలిసివచ్చింది.

**60 గేదెలతో మినీ డెయిరీ ఏర్పాటు**

**కుమ్మెత ఓబులురెడ్డి, చంద్రగిరి**



రెండు సంవత్సరాల క్రితం పది గేదెలతో మినీ డెయిరీని ఏర్పాటుచేసుకున్నా. ఈఏడాది 60 గేదెలతో అదనంగా డెయిరీని పెంచాను. ప్రతిరోజు రెండు వందల లీటర్ల పాలు తీస్తున్నాను. నెలకు మూడున్నర నుంచి నాలుగు లక్షల రూపాయలు వస్తుంది. దీంతో పిల్లల చదువులు, ఇంటి అవసరాలు, డెయిరీ మీద వచ్చే ఆదాయంతోనే జరుపుకుంటున్నాను.

**నెలకు రూ.లక్షన్నర ఆదాయం వస్తుంది**

**- కందిమళ్ళ చంద్రమౌళి, సింగనపాలెం**



2002లో డెయిరీ ఫాం ఏర్పాటు చేసుకున్నాను. అప్పట్లో రూ.25 లక్షల వరకు నష్టాలు చవి చూశాను. 2014లో దాదాపు 70 గేదెలతో మినీ డెయిరీని ఏర్పాటుచేశా. ప్రస్తుతం ఐదు వందల నుంచి 550 లీటర్లు వస్తున్నాయి. అన్ని ఖర్చులు పోను రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల ఆదాయం వస్తుంది. ఆదాయం కన్నా పలువురికి ఉపాధి కల్పిస్తున్నామనే ఆనందం ఉంది.

**పశు పోషకులకు మెరుగైన సేవలు**

**ఎం. విజయలక్ష్మి, పశువైద్యాధికారి, ముండ్లమూరు**

మండలంలో 38 మినీ డెయిరీలు ఉన్నాయి. వీటిల్లో ఉన్న ఆవులు, గేదెలకు ఎలాంటి జబ్బు వచ్చినా నిర్వాహకుడు తెలిపిన వెంటనే అక్కడకు వెళ్ళి పశు వైద్య సేవలు అందిస్తున్నాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా పశు పోషకులకు సేవలు అందిస్తున్నాం.

# అభివృద్ధి ప్రదాత చంద్రబాబు

» **టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి**



దర్శిలో కేకు కట్ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

దర్శి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విప్లవాన్ని గ్రామీణ ప్రాంతాలకు అందించిన అభివృద్ధి ప్రదాత సీఎం చంద్రబాబు అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం దర్శిలో సీఎం చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో ఎన్టీఆర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి శ్రీరాములు విగ్రహాలకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు పుట్టినరోజు కేకును కట్ చేశారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. షిర్డి సాయిబాబా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విజనరీ ఆలోచనలతో, సుదీర్ఘ రాజకీయ అనుభవంతో రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఆయన మార్గదర్శకంలో దర్శి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.

కాగా, స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు సీఎం చంద్రబాబు గతంలో ఎన్నడూలేని విధంగా ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, జి.స్టీవెన్, దారం నాగవేణి, సుబ్బారావు, యాదగిరి వాసు, పుల్లల చెరువు చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

**దొనకొండలో..** దొనకొండ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆదివారం టీడీపీకి చెందిన రెండువర్గాల నాయకులు వేర్వేరుగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు ఆధ్వర్యంలో, పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకుడు కామేపల్లి చెంచయ్య ఆధ్వర్యంలో భారీ కేకు కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు.

**తాళ్లూరులో..** తాళ్లూరు, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు శాగం కొండారెడ్డి, షేక్ కాలేషావలి, గొల్లపూడి వేణుబాబు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, ఇడమకంటి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**ముండ్లమూరులో..** ముండ్లమూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో చంద్రబాబు జన్మదిన సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కేకు కట్‌చేసి శ్రేణులకు పంచి పెట్టారు. అంతకుముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, కూరపాటి శ్రీనివాసరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, మండలపు వెంకటరావు, నాగరాజు, వరగాని పౌలు, కంచుమాటి శ్రీనివాసరావు, చండాడి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

**కురిచేడులో..** కురిచేడు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద కేకు కట్‌చేసి, అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య, కాట్రాజు నాగరాజు, డాక్టర్ సునీల్, కిలారి కొండయ్య, కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

కనిగిరి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం పట్టణంలోని బోయపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండ్లా కన్నయ్య (29) లారీ క్లీనర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో అప్పులు చేస్తూ తల్లిని రూ.50 వేలు ఇవ్వాలని అడిగాడు. డబ్బులు లేవని చెప్పగా, ఎక్కడైన అప్పుగా అయినా తీసుకురావాలని గొడవకు దిగాడు. ఈక్రమంలో తనకెవరు ఇస్తారని చెప్పి బయటికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి లోపల గడియపెట్టి ఉండటంతో తలుపు తీయమని కేకలు వేసినా సమాధానం లేదు. దీంతో స్థానికులు తలుపులు బద్ధలుకొట్టి చూడగా ఇంటో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్నాడు. స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీరాం తెలిపారు.

### నేటి నుంచి ఆలయాల ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు

ముండ్లమూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెల్లంపల్లిలో కోటి రూపాయలతో నిర్మించిన గ్రామ దేవత అంకమ్మ దేవాలయం ప్రతిష్ఠా పూజా కార్యక్రమాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈనెల 23న అంకమ్మ దేవాలయ ప్రతిష్ఠ జరగనున్నది. అలాగే, మారెళ్ళ గ్రామంలో పోలేరమ్మ దేవాలయాన్ని రూ.60 లక్షలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈనెల 23న ప్రతిష్ఠించనున్నారు. శిలల ఊరేగింపు కార్యక్రమం ఆదివారం సాయంత్రం రెండు గ్రామాల్లో నిర్వహించారు.

### బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



బడిఈడు పిల్లల వివరాలను తెలుసుకుంటున్న రవీంద్రనాథ్‌రెడ్డి

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యత మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులపై ఉందని సమగ్రశిక్ష రాష్ట్ర అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ కె.రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల విద్యాశాఖ అధికారి రాజాల కొండారెడ్డితో కలిసి సీఎస్‌పురం, నాగులారం గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరు పాఠశాలల్లో నమోదయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో కూడా పేద విద్యార్థులకు సీట్లు కేటాయిస్తున్నారని అన్నారు. వీరి ఫీజులను ప్రభుత్వం యాజమాన్యాలకు చెల్లిస్తుందన్నారు. ప్రస్తుతం ఒకటో తరగతిలో చేరబోయే విద్యార్థుల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రోత్సహకాలు సమగ్రశిక్ష ద్వారా అందిస్తున్నట్టు చెప్పారు. అంగన్‌వాడీలో నమోదైన ప్రీప్రైమరి విద్యార్థులందరూ ఒకటో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చూడాలన్నారు. విద్యా కమిటీలు, తల్లిదండ్రుల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధ్యమని రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు.

### రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



తైవాన్ స్ప్రేయర్లు అందజేస్తున్న ఎంపీపీ తాటికొండ శ్రీను, ఓబుల్‌రెడ్డి

తాళ్లూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ తాటికొండ శ్రీను అన్నారు. ఆదివారం తాళ్లూరులో మండలంలోని మాధవరం, శివరాంపురం గ్రామాలకు చెందిన రైతులకు సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతుల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందజేస్తుందని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు అనేక రకాల వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై అందజేస్తున్నారని అన్నారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, శాగం కొండారెడ్డి, షేక్ కాలేషావలి, గొల్లపూడి వేణుబాబు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, ఇడమకంటి శ్రీనివాసరెడ్డి, రాచకొండ వెంకట్రావు, గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### రావిగుంటపల్లిలో చలివేంద్రం ప్రారంభం

పామూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిగుంటపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి పాల్గొన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో దళితవాడలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, బి.జయరామిరెడ్డి, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఖాజారహంతుల్లా, సయ్యద్ అమీర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



చంద్రన్న చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఉగ్ర



## మోపెడ్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తికి తీవ్రగాయాలు

పామూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు క్రాస్ అవుతున్న మోపెడ్ వాహనాన్ని వేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన ఆదివారం మండలంలోని వెంకటాపురం వద్ద చోటుచేసుకుంది. సీఎస్‌పురం మండలం రాజుపాలెంకు చెందిన ఎం.శ్రీనివాసులు మోపెడ్‌పై స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈసమయంలో పామూరు నుంచి వెంగనకుంట గ్రామానికి వెళుతున్న కారు వెంకటాపురం జాతీయ రహదారిపై మోపెడ్‌ను ఢీకొని రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న ఆరుగురు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు.

మోపెడ్‌పై వెళుతున్న శ్రీనివాసులుకు తీవ్రగాయాలుకాగా, 108 వాహనం పామూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కందుకూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా ఈస్టర్ వేడుకలు



దొనకొండ ఆర్సీఎం చర్చిలో కేకు కట్ చేస్తున్న రెవరండ్ ఫాదర్ థామస్

దొనకొండ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సర్వమానవాళి పాపక్షమాపణ నిమిత్తం ఏసుక్రీస్తు ప్రభువు శిలువపై మరణించి, తిరిగి మూడవ రోజున మృత్యుంజయుడుగా లేచిన రోజును పురస్కరించుకుని ఈస్టర్ పండుగ వేడు కలు ఆదివారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చిల వద్దకు వచ్చిన పేదలకు దానధర్మాలు చేసి ఒకరినొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దొనకొండ ఆర్సీఎం చర్చిలో సంఘకాపరి రెవరండ్ ఫాదర్ థామస్ ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి నుంచి యేసుక్రీస్తు పునరుత్థాన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఏబీఎం చర్చిలో సంఘ కాపరి రెవరండ్ పాస్టర్ ప్రభుదాస్, సీఎస్ఐ చర్చిలో రెవరండ్ పాస్టర్ షడ్రక్, లూథరన్ చర్చిలో రెవరండ్ పాస్టర్ మధు, క్రీస్తు సంఘం చర్చిలో రెవరండ్ పాస్టర్ జొన్నలగడ్డ జయరావు, కల్వరి చర్చిలో రెవరండ్ పాస్టర్ ధానియేలు ఈస్టర్ పండుగ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు.

**పామూరులో..** పామూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పామూరు, సీఎస్‌పురం మండలాల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ఒకరికొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

**దర్శిలో..** దర్శి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం ఈస్టర్ ఆరాధన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్శిలోని సియోను ప్రార్థనా మందిరంలో పాస్టర్ గొంగటి జాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘపెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

**కురిచేడులో..** కురిచేడు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఉష్ణోగ్రత (అంచనా)

| 21-4-2025 | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 41 | 27 |
| తెనాలి | 39 | 26 |
| నరసరావుపేట | 40 | 25 |
| బాపట్ల | 37 | 27 |
| రెంటచింతల | 41 | 26 |

# తమ్ముళ్లలో.. వజ్రోత్సాహం


కొల్లూరు : కేక్ కట్ చేసి తినిపిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు


చీరాల : రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య


అద్దంకి : సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

- అధినేతకు అభిమానుల నీరాజనాలు
- వాడవాడలా చంద్రబాబు జన్మదినోత్సవాలు
- రక్త.. అన్నదానాలు.. రోగులకు పండ్లు పంపిణీ
- కేకులు కట్ చేసి సందడి చేసిన టీడీపీ శ్రేణులు

బాపట్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి 75వ జన్మదినోత్సవాన్ని జిల్లా అంతటా తెలుగు తమ్ముళ్లు.. అభిమానులు ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. వజ్రోత్సవ వేడుకలను వాడవాడలా టీడీపీ శ్రేణులు, నాయకులు, అభిమానులు ఉత్సాహంగా జరుపుకున్నారు. పల్లెలు.. పట్టణాల్లో అట్టహాసంగా వేడుకలు జరిగాయి. రక్తదాన శిబిరాల్లో యువకులు రక్తదానం చేసి అధినేతపై అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబాబుకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుతూ పార్టీ నేతలు, శ్రేణులు చర్చిలు, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. రాష్ట్రాభివృద్ధికి పాటు పడుతున్న తమ అధినేత నిండు నూరేళ్ల వర్ధిల్లాలని శ్రేణులు కోరుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జిల్లాలో పలు చోట్లు అన్నదానాలు జరిగాయి. టీడీపీ కార్యాలయాలతో పాటు పట్టణాలు, గ్రామాల్లోని కూడళ్లలో చంద్రబాబు జన్మదినోత్సవ కేకులను ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు కట్ చేశారు. స్వర్ణాంధ్ర లక్ష్యంగా చంద్రబాబు పాలన చేస్తున్నారని నేతలు తెలిపారు. బాపట్లలోని పార్టీ కార్యాలయంలో శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వేమూరులో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. కొల్లూరులో 75 కేజీల భారీ కేక్‌ను ఎమ్మెల్యే ఆనందబాబు కట్ చేశారు. తొలుత క్రాప రోడ్డు నుంచి భారీ ర్యాలీగా తరలి వస్తూ గాంధీనగర్ వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. 75 కిలోల కేక్‌ను కట్ చేసి అన్నదానం వంటి సేవా కార్యక్రమాలను చేపట్టిన పార్టీ శ్రేణులను ఆనందబాబు అభినందించారు. అమృతలూరులోని బాబుజగ్జీవన్‌రామ్ పార్కు వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం జరిగింది. చెరుకుపల్లిలో టీడీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించగా అనగాని శివప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం 20 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. నగరంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని అనగానిశివప్రసాద్ ప్రారంభించారు. చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను నిర్వహించి అక్కడ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పర్చూరు నియోజకవర్గం కారంచేడులో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను పార్టీశ్రేణులు నిర్వహించాయి. అద్దంకిలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్‌చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.


బాపట్ల : ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన కేక్ కట్ చేస్తున్న రైల్వేబోర్డుమెంబరు పఠాన్ రాజేష్ తదితరులు


బాపట్ల : ఏరియావైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి తదితరులు


రేపల్లె : ఎన్టీఆర్‌సర్కిల్లో అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్


పర్చూరు : కారంచేడులో సీఎం జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



# పేదలకూ.. కార్పొరేట్ విద్య

- ఆర్టీఈ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థులకు ఉచితం
- ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు కేటాయింపు
- వచ్చే నెల 15 నుంచి 20 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం
- న్యాయ సమస్యలు తలెత్తకుండా పక్కాగా అమలుకు ప్రణాళిక
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 5000 మందికిపైగా అవకాశం

గుంటూరు(విద్య), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలోలా కాకుండా పక్కాగా పేదలకు కార్పొరేట్ విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం విద్యా హక్కు చట్టానికి(ఆర్టీఈ) సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యాహక్కు చట్టం ద్వారా పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25% సీట్లు కేటాయించేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళిక సిద్ధం చేసింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో పరిధిలో ఈ విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో 5 వేలకు పైగా పేద విద్యార్థులు అడ్మిషన్లు పొందనున్నారు. గత ప్రభుత్వ వైఫల్యంతో విద్యా హక్కు చట్టం ద్వారా సీట్లు వచ్చినా ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం కల్పించలేని దుస్థితి నెలకొంది. గడిచిన ఐదేళ్లలో ఈ చట్టాన్ని అస్తవ్యస్తంగా అమలు చేయడంతో పేదలు ఆ అవకాశాన్ని పొందలేక పోయారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రైవేట్ యాజమాన్యాలు కోర్టులను ఆశ్రయించి విద్యాహక్కు చట్టం అడ్మిషన్లకు నిరాకరించాయి. ప్రైవేట్ యాజమాన్యాలకు దీటుగా గత ప్రభుత్వం న్యాయపరమైన అంశాల్లో నిర్లక్ష్యం వహించింది. దీంతో విద్య హక్కు చట్టం ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులు ఫీజులు చెల్లించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొంతమంది విద్యార్థులు సీట్లు వచ్చినా యాజమాన్యాల వేధింపుల కారణంగా చేరకుండా ఇతర పాఠశాలకు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ఈ సారి న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు సమగ్ర శిక్ష ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 400కు పైగా ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండగా 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు విద్యా హక్కు చట్టం ద్వారా కేటాయించాల్సి ఉంది. ఈ చట్టం ప్రకారం అడ్మిషన్లు పొందే విద్యార్థుల ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుంది.

**అర్హులు.. దరఖాస్తు ఇలా..**

విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం పొందడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యుఎస్, ఓసీలో విభిన్న ప్రతిభావంతులు, అనాథలు, హెచ్ఐవీ బాధిత తల్లిదండ్రుల పిల్లలు ఆర్టీఈ ప్రవేశాలకు అర్హులు. ఆయా వర్గాల విద్యార్థులు తమ సమీపంలోని ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్సీ, స్టేట్ సిలబస్‌లో బోధన అందించే ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల ఆధార్, ఇతర ప్రాథమిక వివరాలతో https://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో మే 15 నుంచి 20వ తేదీలోగా రిజిస్టర్ చేసుకోవాలి. అదేవిధంగా సచివాలయాలు, మండల విద్యా వనరుల కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అర్హులకు లాటరీ ద్వారా సీట్లు కేటాయిస్తారు. ఇతర సమాచారం కోసం 1800 42 58 599 అనే టోల్ ఫ్రీ ద్వారా తెలుసుకోవచ్చని గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక తెలిపారు. మే 21 నుంచి 24లోగా మొదటి విడత అర్హుల జాబితాను విడుదల చేస్తామని తెలిపారు.

# ఎప్పుడిస్తారో...



- రేషన్ కార్డులు, పింఛన్ల మంజూరులో జాప్యం
- తహసీల్దారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- సంక్రాంతి.. ఉగాది అన్నారు.. దసరాకైనా ఇచ్చేనా
- ప్రజాప్రతినిధులను నిలదీస్తున్న దరఖాస్తు దారులు

**అధికారంలోకి రాగానే కొత్తగా రేషన్ కార్డులు ఇస్తాము. అర్హులైన లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు అందజేస్తాము.. అన్నారు. అయితే మరో నెలన్నరకు కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తోంది. అయినా ఇంత వరకు కొత్త రేషన్ కార్డులు, సామాజిక పింఛన్ల ఊసే లేదు. ప్రభుత్వం నుంచి వీటి పై కనీస ప్రకటనలు కూడా ఉండటంలేదు. దీంతో కార్డులు, పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న వారు నిరాశకు గురవుతున్నారు. ఎమ్మెల్యేలు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో కూడా అత్యధికంగా కార్డులు, పింఛన్ల కోసమే పలువురు దరఖాస్తులు అంద జేస్తున్నారు. ఒకే కుటుంబంలో తల్లి, తండ్రి, కుమారుడు, కోడలు ఉంటే రేషన్ కార్డులు వేరుగా తీసుకునేందుకు దంపతులు ఆసక్తి చూపు తున్నారు. సంక్రాంతి అన్నారు. ఆ తర్వాత ఉగాది అన్నారు. ఆయా పండుగులు వచ్చాయి.. పోయాయి అయినా కార్డులు, పింఛన్ల జాడలేదు. ఈ పరిస్థితుల్లో దసరాకైనా ఇస్తారా అని ఆశావాహులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో, ప్రజాప్రతినిధుల పర్యటనల్లో దరఖాస్తు దారులు నిలదీస్తుండటంతో ఏమి చేప్పాలో తెలియక ఆయా నేతలు నీళ్లు నములుతున్నారు.**

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కొత్త కార్డులు.. పింఛన్ల మంజూరులో జాప్యం జరుగుతోంది. పింఛన్లు, కార్డుల ఊసే ప్రభుత్వం ఎత్తకపోతుండటంతో దరఖాస్తుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రజాప్రతినిధులను, గ్రామ.. వార్డు స్థాయిలో నేతలను నిలదీస్తున్నారు. దీంతో కూటమి నేతలు ప్రజల వద్దకు వెళ్లాలంటే జంకే పరిస్థితులు నెలకొంటు న్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డులు, పింఛన్లు ఇస్తామంటూ గతంలో ఎమ్మెల్యేల ప్రకటనలతో తహసీల్దారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కార్డులు, పింఛన్ల కోసం వేలాది మంది అధికారులకు దరఖాస్తులు అందజేశారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన దరఖాస్తులను ఎమ్మెల్యేలు అధికారులకు సిఫార్సు చేస్తున్నారు. అయితే రేషన్ కార్డు, పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

**వైసీపీ హయాంలో రాజకీయ కక్షతో తొలగింపులు**

వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ సానుభూతి పరులుగా ముద్ర వేసి పింఛన్లు, రేషన్ కార్డులను పెద్దసంఖ్యలో తొలగించారు. వైసీపీ నేతల సిఫార్సుల తో అనర్హులకు రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేశారు. దొంగ మెడికల్ ధ్రువపత్రాలు సృష్టించి దివ్యాంగుల కోటాలో వందలాది మంది అనర్హులు పింఛన్లు తీసుకుంటున్నారు. ఆయా పింఛన్లపై కూటమి ప్రభుత్వం చేపట్టిన విచారణ నత్తనడకన సాగుతోంది. అనర్హులను తొలగించి అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నా వారి మొర ఆలకించే వారే కరువయ్యారు.

**ఇంకా జగన్ ఫొటోలతోనే**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది సమీపిస్తున్నా ఇంకా మాజీ సీఎం జగన్, వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రాల తోనే రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జగన్ ఫొటోలు ఉన్న కార్డులను మారుస్తామని, కొత్త కార్డులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందే తప్ప అమలును విస్మరించిందన్న విమర్శలున్నాయి.

**మూడు జిల్లాల్లో 30,796 కార్డులు రద్దు**

కొత్తగా పంపిణీ ఎలా ఉన్నా ఇప్పటికే ఉన్న రేషన్ కార్డులను భారీగానే రద్దు చేసినట్లు పౌరసరఫరాల శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. జూలై 2024న ఉన్న రేషన్ కార్డుల సంఖ్యకు ఈ నెలలో రేషన్ కార్డుల సంఖ్యకు వేలల్లో ఉన్న వ్యత్యాసం కనిపిస్తోంది. జూలైలో పల్నాడు జిల్లాలో 6,45,110 కార్డులు ఉండగా ప్రస్తుతం 6,34,893 కార్డులు ఉన్నాయి. గుంటూరు జిల్లాలో 5,99,511 కార్డులకు 5,88,874 ఉన్నాయి. ఇక బాపట్ల జిల్లాలో 4,86,029 కార్డులకు 4,76,087 మాత్రమే ఉన్నట్లు సంబంధిత పోర్టల్ ద్వారా అర్థమవుతోంది. అంటే పల్నాడు జిల్లాలో 10,217, గుంటూరు జిల్లాలో 10,637, బాపట్ల జిల్లాలో 9,942 కార్డులు తగ్గినట్లు సదరు శాఖ లెక్కలు చెబుతున్నాయి. మూడు జిల్లాల్లో 30,796 కార్డులు తగ్గాయి.



**రేషన్ కార్డుతోనే పథకాల లబ్ధి**

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు అర్హత సాధించాలంటే ప్రధానంగా రేషన్ కార్డు ఉండాలి. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉప కార వేతనాలకు రేషన్ కార్డు ఆదాయ ధ్రువీకరణపత్రంగా ఉపకరిస్తుంది. ఎన్టీఆర్ వైద్య సేవల కార్డు ఉండాలన్నా, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు పొందాలన్నా రేషన్ కార్డు తప్పని సరి. పింఛన్ మంజూరుకు కూడా రేషన్ కార్డు ఉండాల్సిందే. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో వేలాది మంది రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. రేషన్ కార్డు లేని వారు, సాంకేతిక కారణాలతో కార్డు పొందలేని వారు తమకు తాజాగా మంజూరు చేయాలని అధికారులను కోరుతున్నారు.

# రూ.20 లక్షల పేలుడు పదార్థాల సీజ్

**ఆరుగురిపై కేసు.. వైసీపీ నేత సహా మరొకరి అరెస్టు**

మార్టూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా నిషేధిత పేలుడు పదార్థాలను అమ్ముతున్న మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నేత దాసం హనుమంతరావుతోపాటు మరొకరిని అరెస్టు చేసినట్లు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. రూ.20 లక్షల పేలుడు పదార్థాలు, వాటి అక్రమ రవాణాకు ఉపయోగించే వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. మార్టూరు పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ తెలిపారు. దాసం హనుమంతరావు నాగరాజుపల్లిలోని గోడౌన్‌లో పేలుడు పదార్థాలను నిల్వ ఉంచి అమ్మకాలు చేస్తున్నాడు. గ్రానైట్ క్వారీల్లో ముడిరాళ్లను పగలగొట్టేందుకు ఉపయోగించే మందుగుండు సామగ్రి, జిలెటిన్ స్టిక్స్, డిటొనేటర్లు తదితరాలను హనుమంతరావు తెలంగాణ కీసర మండలం అంకిరెడ్డిపాలెంలోని సాల్వో ఇండస్ట్రీస్ నుంచి కొనుగోలు చేసి స్థానికంగా విక్రయిస్తున్నాడు. ఇతడికి దాసం వీరాంజనేయులు సహకరిస్తున్నాడు. ఈ నెల 18న ఎలాంటి బిల్లులు లేకుండా కొనుగోలు చేసిన 108 బాక్సులు థండర్ బోల్ట్ జిలెటిన్ పేలుడు పదార్థాలను(4,500 కిలోలు), 20 బాక్సులను జిలెటిన్(5 టన్నులు), సాల్వో సూపర్ ఈ-90కి చెందిన 30 బాక్సులు, సాల్వో కార్డ్ 10కి చెందిన 7,500 మీటర్ల స్టాక్‌ను హనుమంతరావు కొనుగోలు చేసి లారీలో తీసుకు వస్తున్నట్లు ఎస్పీ తుషార్‌డూడీకి సమాచారం అందింది. ఈ క్రమంలో శనివారం నాగరాజుపల్లిలోని గోడౌన్‌ను తనిఖీ చేపట్టి పేలుడు పదార్థాలను సీజ్ చేశారు. తెలంగాణ నుంచి నాగండ్ల ప్రసన్న అనే వ్యక్తి లారీలో తీసుకువస్తున్న పేలుడు పదార్థాలను హనుమంతరావు, దాసం వీరాంజనేయులు, మిగాల నాగవేణుగోపాల్ ముందుగా అనుకున్నట్లు బత్తుల సాంబశివరావు ద్వారా ప్రతాప్‌రెడ్డికి అమ్మాడు. గతంలో వీరు వినుకొండ, గుంటూరులోని పేరేచర్లలో క్రషర్ ఓనర్లకు కూడా అమ్మినట్లు తేలింది. దీంతో హనుమంతరావు, వీరాంజనేయులును అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. మరో నలుగురిపై కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు చెప్పారు. బల్లికురవ మండలం కొణిదెన పరిధిలోని హనుమంతరావుకు చెందిన గ్రానైట్ పరిశ్రమలో 2,300 ఎలక్ట్రానిక్ డిటొనేటర్స్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. సమావేశంలో సీఐలు ఎం.శేషగిరిరావు, వెంకట్రావు, ఏఎస్ఐ బాషా ఉన్నారు. హనుమంతరావు, వీరాంజనేయులును ఆదివారం అద్దంకి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. వారిని దర్శి సబ్ జైలుకు తరలించారు.


నిందితుల వివరాలు చెప్తున్న డీఎస్పీ రామాంజనేయులు, సీఐలు శేషగిరిరావు, వెంకట్రావు

# మార్టూరులో 24 నుంచి నాటికల సందడి

మార్టూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకారం స్వచ్ఛంధ సేవా సంస్థ, రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో స్థానిక మద్ది సత్యనారాయణ కంపెనీ ఆవరణలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో శ్రీకారం రోటరీ కళాపరిషత్ 15వ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీకారం సంస్థ కార్యదర్శి జాష్టి అనూరాధ, రోటరీ అధ్యక్షుడు మద్దుమాల కోటేశ్వరరావు తెలిపారు. నాటిక పోటీల బ్రోచర్‌ను ఎపర్ట్ కార్యాలయంలో ఆదివారం శ్రీకారం, రోటరీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకారం సంస్థ కన్వీనర్ జాష్టి వెంకటమోహనరావు మాట్లాడుతూ కళాపరిషత్ నాటిక పోటీలను నిర్వహిస్తూ మార్టూరు రోటరీ చరిత్ర సృష్టించిందన్నారు. ఏటా సుమారు రూ.6 లక్షలకు పైగా వ్యయంతో, 150 మంది కళాకారులతో నాటిక పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశం లో శానంపూడి లక్ష్మయ్య, షేక్ ఖాజాహుస్సేన్, న్యాయవాది గొట్టిపాటి శ్రీనివాసరావు, ఎం.ఈశ్వరప్రసాద్, గుండవరపు వెంకట ప్రసాద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రోటరీ సభ్యులు

# పుష్కరకాలం తరువాత మేజర్‌లలో పూడికతీత

- అద్దంకి డివిజన్‌లో రూ.2.28కోట్లతో పనులు
- సాగునీటి ప్రవాహానికి తొలగనున్న అడ్డంకులు
- టీడీపీ కూటమి వచ్చాక ముందస్తుగా నిర్వహణ
- గత ఏడాది మంత్రి గొట్టిపాటి చొరవతో గట్టెక్కిన సాగు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

అద్దంకి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కాలువలకు నీటి విడుదల జరుగుతుందంటే రైతులలో ఆందోళన ఉండేది. సాగర్ కాలువలలో పూడిక పేరుకు పోయి ఉండడంతో చివరి ఆయకట్టు వరకు నీటి విడుదల జరుగుతుందా లేదా అనే అనుమానాలు ఉండేవి. ఈ నేపథ్యంలో రైతులు ఆలస్యంగా వరి సాగు చేపడుతుంటారు. గత ఏడాది సకాలంలో సాగర్ కాలువలకు నీటి విడుదల జరిగినా... నీటి ప్రవాహం ముందుకు సాగక రైతులు ఇబ్బంది పడ్డారు. దీంతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సాగర్ కాలువలకు నీటి విడుదల చేసిన తరువాత రైతుల ఆందోళనను గుర్తించి ఎక్స్‌కవేటర్‌లను ఏర్పాటు చేయించి తాత్కాలికంగా పూడిక తీత పనులు చేయించడంతో గత ఏడాది సాగునీటి కష్టాల నుంచి రైతులు గట్టెక్కారు.

సాగర్ కాలువలకు పుష్కరకాలం తరువాత పూడికతీత పనులు చేపట్టారు. 2012 సంవత్సరంలో సాగర్ కాలువల ఆధునికీకరణ పనులలో భాగంగా సిమెంట్ లైనింగ్ చేశారు. దీంతో సుమారు ఐదారు సంవత్సరాల తరువాత నీటి ప్రవాహనికి ఎలాంటి అడ్డంకులు లేకుండా దిగువ ఆయకట్టుకు కూడా సాగు నీటి సరఫరా జరుగుతుంది. అయితే మేజర్ కాలువలలో పూడిక పేరుకు పోవడంతో గత ఐదారు సంవత్సరాలుగా సాగు నీరు ముందుకు కదలక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం


వెంపరాల మేజర్‌లో పూడికను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

వచ్చిన వెంటనే రైతులకు సాగునీటి కష్టాలు లేకుండా చేయాలన్న సంకల్పంతో మేజర్ కాలువల మరమ్మతులకు నిధులు విడుదల చేశారు. అద్దంకి డివిజన్ పరిధిలో మేజర్ కాలువల మరమ్మతులకు 2.28 కోట్ల రూపాయల నిధులు విడుదలయ్యాయి. వీటితో ఆయా మేజర్‌లలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. గత పక్షం రోజులుగా పనులు ప్రారంభమయ్యాయి. అద్దంకి సబ్ డివిజన్‌లో రూ.1.50కోట్లతో, సంతమాగులూరు సబ్ డివిజన్ పరిధిలో రూ.53.59లక్షలతో, కొనంకి సబ్ డివిజన్‌లో రూ.24.50లక్షలతో మరమ్మతు పనులు ప్రారంభించారు. అద్దంకి సబ్ డివిజన్ పరిధిలో పమిడిపాడు మేజర్‌కు రూ.94.70 లక్షలు, అద్దంకి మేజర్‌కు రూ.23.94


పూడిక తీసిన తర్వాత వెంపరాల మేజర్ కాలువ

లక్షలు, వెంపరాల మేజర్‌కు రూ.21.28లక్షలు, గుంటుపల్లి మేజర్‌కు రూ.10.62లక్షలు కేటాయించారు. ఇప్పటికే అత్యధిక శాతం పనులు ప్రారంభమయ్యాయి.

**నాడు ముందే హడావుడి**

**నేడు నీటి విడుదల నిలిపిన వెంటనే పనులు**

సాగర్ కాలువలలో మరమ్మతు పనులు నీటి విడుదలకు కొద్దిరోజులు ముందు హడావుడిగా పూర్తి చేసి కాంట్రాక్టర్‌లు, అధికారులు జేబులు నింపుకునే వారు. పనులు చేసీచేయక ముందే నీటి విడుదల జరిగేది. దీంతో మరమ్మతు పనులు చేసారో... లేదో కూడా అర్థం కాని పరిస్థితి. అయితే కూటమి ప్రభుత్వంలో పద్ధతి మారింది. సాగర్ కాలువలకు నీటి విడుదల నిలిపి వేసిన వెంటనే పనులు ప్రారంభించారు. నెలరోజుల వ్యవధిలో పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. దీంతో తాగునీటి అవసరాలకు మేలో నీటి విడుదల చేసే లోపలే పనులు పూర్తి చేయాల్సి ఉంది. దీంతో పూడిక తీత పనులలో మాయాజాలం చేసే అవకాశం తక్కువగా ఉంటుందనే అభిప్రాయం ఉంది. సుమారు పుష్కర కాలం తరువాత ఎట్టకేలకు మేజర్ కాలువలలో పూ డికతీత, జంగిల్ క్లియరెన్స్‌కు నిధులు కేటాయించి పనులు ప్రారంభించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న యువనేత హర్షవర్ధన్, నాయకులు

## యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

అద్దంకి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని టీడీపీ యువనేత గొట్టిపాటి హర్షవర్ధన్ అన్నారు. పట్టణంలోని రాజీవ్ కాలనీలో తెలుగుయువత ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం హర్షవర్ధన్ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. 10రోజులపాటు జరిగే టోర్నమెంట్‌లో జిల్లాలోని 43 టీమ్‌లు పాల్గొననున్నాయి. కార్యక్రమంలో సీఐ సుబ్బరాజు, టీడీపీ నేతలు కాకాని అశోక్, గార్లపాటి శ్రీనివాసరావు, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, కౌన్సిలర్‌లు, నేతలు పాల్గొన్నారు.

## నేడు చీరాలలో కలెక్టర్ 'మీకోసం'

చీరాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : సోమవారం మునిసిపల్ కార్యాలయంలో కలెక్టర్ వెంకటమురళి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనికి ఎమ్మెల్యే కొండయ్యతోపాటు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు హాజరవుతున్నారు. ప్రజలు న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు.

## వక్ఫ్ బిల్లుపై రౌండ్ టేబుల్ సమావేశం


పేరాల(చీరాల), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా చీరాల పరిధిలోని ముస్లిం మైనార్టీ నాయకులు, మత పెద్దలు ఆదివారం పేరాల ముస్లిం షాదీఖానాలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుపై ఇప్పటికే సుప్రీం కోర్టు ధర్మాసనాన్ని ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లింలకు మాత్రమే ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఆయా బోర్డులో వచ్చే ఆదాయంతో పేద ముస్లిలం అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. వచ్చే శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మతపెద్దలు అబ్దుల్ రహీమ్, షౌకత్ అలీ, అల్లా భక్షి, అబ్దుల్ సలీమ్, అబీబుల్లా, కబీర్, సీపీఐ నాయకులు బాబురావు పాల్గొన్నారు.

## వేసవి కబడ్డీ శిక్షణ ప్రారంభం


వేసవి కబడ్డీ శిక్షణను ప్రారంభిస్తున్న డాక్టర్ సుబ్బారావు

చినగంజాం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్, స్థానిక బాలకోటేశ్వరస్వామి స్పోర్ట్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న వేసవి కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ఆదివారం డాక్టర్ నల్లూరి సుబ్బారావు ప్రారంభించారు. మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి 100 మంది క్రీడాకారులు హాజరైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా బాస్కరావు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరానికి హాజరైన క్రీడాకారులకు పౌష్టికాహారం, క్రీడా దుస్తుల నిమిత్తం లక్షరూపాయిల ఆర్థిక సహాయాన్ని డాక్టర్ సుబ్బారావు అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల కబడ్డీ జట్టుకు ప్రాబబుల్స్‌ను ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, వై.పూర్ణచంద్రరావులు తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి 50 మంది క్రీడాకారులు హాజరు కాగా, వారిలో ప్రతిభ చూపిన 15 మందిని ప్రాబబుల్స్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు కళాశాల ఆవరణలో ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో ప్రతిభ చూపిన ఆరుగురిని తుది జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఏ.వేణుగోపాల్, తెలంగాణ, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గసభ్యులు, చైర్మన్ ఎన్.చంద్రమోహన్‌రెడ్డి, కోశాధికారి డి.రమేష్, ఉపాధ్యక్షులు ప్రసాద్, బికే.స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ఎం.గిరిబాబు, కార్యవర్గసభ్యులు, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఏబీసీ కాలువ కట్టపై ముళ్లచెట్ల తొలగింపు


రామాంజనేయపురం వద్ద కాలువ కట్టపై ఉన్న ముళ్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

బల్లికురవ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఎంతో కాలం నుంచి అద్దంకి బ్రాంచ్ కాలువ కట్టపై చిట్టడవిని తలపించేలా ఉన్న ముళ్ల చెట్లను అధికారులు తొలగించే చర్యలు చేపడుతున్నారు. ఆదివారం బల్లికురవ మండల పరిధి రామాంజనేయపురం గ్రామ సమీపంలో ఉన్న ఏబీసీ కాలువ కట్టపై ఉన్న ముళ్ల చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్నారు. దీంతో కాలువలో నీరు దిగువ భూములకు సకాలంలో చేరడంతోపాటు రైతులకు ఇబ్బందులు తొలగనున్నాయి. కొన్ని చోట్ల కాలువలోకి చెట్లు వ్యాపించి ఉన్నాయని రైతులు అంటున్నారు. ఏబీసీ కాలువ మెత్తం రెండు వైపులా ముళ్ల చెట్లను తొలగిస్తే కాలువ కట్టపై రాక పోకలకు కూడా ఇబ్బందులు ఉండవని రైతులు చెప్తున్నారు.

# ఘనంగా సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు


అద్దంకిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య


పర్చూరులో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

అద్దంకి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : విజన్ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబు అని టీడీపీ నేతలు కొనియాడారు. పట్టణంతోపాటు గ్రామాలలో ఆదివారం సీఎం చంద్రబాబు పుట్టినరోజు కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక కార్యాలయంలో టీడీపీ నేతలు కేక్ కట్ చేశారు. రాజీవ్‌కాలనీలో కేక్‌ను మంత్రి గొట్టిపాటి హర్షవర్ధన్ కేక్ కట్ చేశారు. మెయిన్ రోడ్డులో గొట్టిపాటి సైన్యం ఆధ్వర్యంలో, మున్సిపల్ కార్యాలయం సమీపంలో, 18, 19 వార్డులతో పాటు పలు చోట్ల కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమాల్లో పట్టణాధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, కౌన్సిలర్‌లు కంపా రజనీ, తిరుపతమ్మ, విజయలక్ష్మి, కాకాని అశోక్, రామారావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, కరి పరమేష్, రమేష్, శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, లహరి, కోనేటి అనిల్, నరేంద్ర, స్టాలిన్, మురళీసుధాకర్, రామాంజనేయులు, కొండలు, అనిల్ పాల్గొన్నారు. ధేనువకొండ పునరావాసకాలనీ బలరామకృష్ణపురంలో నాగినేని రామకృష్ణ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టిన రోజు వేడుక ఘనంగా నిర్వహించారు.

పంగులూరు : సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రాన్ని ప్రగతపథంలో ముందుకు నడుపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు విజనరీ నేత అని టీడీపీ నాయకులు కొనియాడారు. ఆదివారం చంద్రబాబు పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. బీసీ బాలికల వసతి గృహంలో కేక్ కట్ చేసి, పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కేవీ సుబ్బారావు, రామసుబ్బారావు, ఏడుకొండలు, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి ప్రదాత బాబు

**ఎమ్మెల్యే కొండయ్య**

చీరాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధి ప్రదాత, నిరంతర శ్రామికుడు సీఎం చంద్రబాబు అని, మెగా డీఎస్సీ ప్రకటనతో వేల ఉద్యోగాల కల్పనతో శ్రామికుడయ్యారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు జరిగాయి. క్యాంపు కార్యాలయంలో కేక్ చేశారు. ఏరియా హాస్పిటల్ వద్ద గర్భిణులు, రోగులకు పండ్లు, బ్రెడ్‌లను ఎమ్మెల్యే అందజేశారు. రక్తదానాన్ని అందజేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నేటికీ నవయువకుడిలా, రాష్ట్ర భవిష్యత్తు కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న యోధుడు బాబు అని కొనియాడారు. ముందుగా బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

పర్చూరు : సీఎం చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. చంద్రబాబు చిత్రపటాల వద్ద కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. బొమ్మల సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేశారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షులు మక్కెన శేఖర్‌బాబు నేతృత్వంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యకమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, సురేష్, చింపయ్య, శ్రీనివాసరావు, దుర్గా, గౌస్ బాషా పాల్గొన్నారు. నాగులపాలెంలో వేడుకలు నిర్వహించారు.

కారంచేడులో : కారంచేడు మండలంలో టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం కేక్ కట్ చేసి, మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామయ్య, డీపీఎల్, దగ్గుబాటి చౌదరి పాల్గొన్నారు.

ఇంకొల్లు : చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పర్చూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు, రాష్ట్ర వాణిజ్య విభాగపు కార్యదర్శి పాలేరు రామకృష్ణ, మార్క్, సంధ్యారాణి, అనంతలక్ష్మి, జనసేన పార్టీ ఇన్‌చార్జి విజయకుమార్, నాయకులు పాల్గొన్నారు.

మార్టూరు : ముఖ్య మంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆదివారం మండలంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఏ లూరి క్యాంపు కార్యాలయం, మార్టూరు లోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అమ్మ ఆశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

చినగంజాం : సీఎం చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా టీడీపీ కార్యాలయ ఆవరణలో మండల పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య కేకు కట్ చేశారు. పెదగంజాం గ్రామ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ నక్కల కృష్ణ కేకు కట్ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌లు రాయని ఆత్మారావు, రాఘవయ్య, అబ్దుల్‌కలాం ఆజాద్, లక్ష్మి, నీలాయపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఏలూరి క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


పెదగంజాంలో కే కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


ఇంకొల్లులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

# వైభవంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

**సుదూర ప్రాంతాల నుంచి హాజరై మొక్కులు చెల్లించుకున్న భక్తులు**

పేరాల(చీరాల), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పేరాలలోని శ్రీ పేరాల పోలేరమ్మ అమ్మవారి ఆలయ 50వ వార్షికోత్సవ పూజలు వైభవంగా జరుగుతున్నాయి. కోరిన కోర్కెలు తీర్చే అమ్మ పోలేరమ్మకు మొ క్కులు చెల్లించేందుకు ఆదివారం సుదూ ర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చా రు. ఈక్రమంలో పెద్ద ఎత్తున జల బిం దెల కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు, పెద్దలు, మహిళలు ప్రత్యేక పూజలతో పాటు మొక్కులు చెల్లించి అమ్మను వేడుకున్నారు. ఉత్సవాలు మంగళవారంతో ముగిస్తాయని కమిటీ ప్రతినిధులు చెప్పారు.


జల బిందెలతో వస్తున్న మహిళా భక్తులు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

### ఏటా ఉత్సవాల్లో పాల్గొంటున్నా

ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాను. ఏటా పోలేరమ్మ ఉత్సవానికి వచ్చి మొక్కు తీర్చుకుంటాను. కోరిన కోర్కెలు తీర్చే అమ్మ పోలేరమ్మ.

- పూజిత, హైదరాబాద్

### అమ్మ చెప్పింది ఈ అమ్మపై నమ్మకముంచమని

అమ్మమ్మ ఊరు కావడంతో ఏటా ఇక్కడ పూజలకు వస్తుంటాను. మా అమ్మ చెప్పింది పోలేరమ్మపై నమ్మకం ఉంచమని. అందుకనే బాగా చదువు రావాలని మొక్కుకున్నా. అందుకే ఏటా పూజల్లో ఉత్సాహంగా హాజరవుతా.

- నాగ లిఖిత, రావూరు


బిక్షాల కాలనీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

## ఘనంగా ఈస్టర్

అద్దంకిటౌన్ : క్రీస్తు సమాధి నుంచి మూడవ రోజు సజీవుడుగా లేచారని పలువురు పాస్టర్‌లు తెలిపారు. ఈస్టర్ పండుగను బిక్షాల కాలనీ చర్చిలో పాస్టర్ ఇటికాల యోహాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పసుమర్తిపాలెం, కట్టకిందపాలెం, మొండితోకపాలెం, ఎన్ఆర్‌నగర్, రామ్‌నగర్‌తో పాటు పలు కాలనీలలోని చర్చిల్లో ప్రార్థనలు చేశారు. బిక్షాల కాలనీల చర్చి వద్ద 1500 మందికి మజ్జిగను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమం లో సంఘ కాపరులు, సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

చీరాల : అన్ని చర్చిల్లో ఈస్టర్ సందర్భంగా ప్రార్థనలు చేశారు. శ్మశాన వాటిక వద్దకు వెళ్లి సమాధుల వద్ద ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్‌లు సువార్త సందేశాన్ని ఇచ్చారు.

బల్లికురవ : మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం అన్ని చర్చిల్లో ప్రార్థనలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

చినగంజాం : మండల పరిధిలోని గ్రామాల్లో ఈస్టర్‌ను ఆదివారం అన్ని చర్చిల్లో ఘనంగా నిర్వహించారు. వేకువజామునే సమాధితోటకు వెళ్లి వివిధ రకాల పూలతో అలంకరించి, కొవొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. కడవకుదురు, పెదగంజాం, చినగంజాం, సంతరావూరు, గొనసపూడి, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం, మూలగానివారిపాలెం, చింతగుంపల్లి తదితర గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## భార్యను హత్య చేసిన భర్త

**యనమదల గ్రామంలో ఘటన**


మంగమ్మ

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అనుమానం పెనుభూతంగా మారింది. జీవితాంతం తోడుగా ఉండాల్సిన భర్త కాలయముడై భార్యను కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘటన యద్దనపూడి మండలం యనమదల గ్రామంలో శనివారం అర్ధరాత్రి (ఆదివారం తెల్లవారుజాము) జరిగింది. గ్రామంలోని నీలం శ్రీనివాసరావు అనే వ్యక్తి భార్య మంగమ్మ (45) తలపై గడ్డపారతో కొట్టి హత్య చేశారు. ఆ వివరాలను ఎస్ఐ రత్నకుమారి వివరించారు. కూలినాలి చేసుకుంటూ జీవనం సాగించే శ్రీనివాసరావు మంగమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. వారిలో అమ్మాయి శ్రీలక్ష్మికి గతంలోనే వివాహం చేశారు. కుమారుడు సాయి విజయవాడలో ఉద్యోగం చేస్తున్నారు. అయితే ఇంటిలో భార్యాభర్తలు మాత్రమే ఉంటున్నారు. రెండురోజులు కిందట మంగమ్మ విజయవాడలో ఉంటున్న చెల్లెలు కుమార్తె నిశ్చితార్థానికి వెళ్లి శనివారం రాత్రి వచ్చారు. అయితే ఇంటిలో రాత్రి నిద్రపోతున్న సమయంలో భార్యపై ఎప్పటి నుంచో అనుమానం పెంచుకున్న భర్త శ్రీనివాసరావు గడ్డపారతో తలపై కొట్టగా ఆమె మృతి చెందారు. అనంతరం మృతదేహన్ని తాడుతో కట్టి ఈడ్చుకుంటూ సమీపంలో ఖాళీ పొలంలో పడేశాడు. ఆదివారం చూసిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ రామాంజనేయులు, ఎస్ఐ రత్నకుమారి పరిశీలించారు. వీఆర్వో సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహన్ని పర్చూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కుమారుడు సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బైక్ అదుపు తప్పి యువకుడికి తీవ్రగాయాలు

కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపు తప్పి యువకునికి తీవ్రగాలయాలైన ఘటన ఆదివారం కారంచేడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిలకూరిపేటకు చెందిన షేక్ ఉమర్, మరో ఇద్దరు స్నేహితులతో కలసి బైక్‌పై చీరాల వాడరేవు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. కారంచేడు సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి పడిపోవడంతో ఉమర్‌కు తీవ్రగాయలు కాగా, మిగిలిన ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. వారిని చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు ఆసుపత్రికి తరలించారు.

## తమిళనాడులో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

**గోవాడలో విషాదఛాయలు**



మృతదేహన్ని బావిలో నుంచి బయటకు తీస్తున్న గజఈతగాళ్లు


అద్దంకి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి సరదాగా బావిలో ఈతకు దిగి మృతి చెందిన ఘటన తమిళనాడులో చోటు చేసుకుంది. అద్దంకి మండలం గోవాడకు చెందిన మాదాల నాగేశ్వరరావు కుమారుడు వెంకటేష్ (20) తమిళనాడు రాష్ట్రంలోని శ్రీరంగం సమీపంలో ఉన్న ధనలక్ష్మి శ్రీనివాసన్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం సరదాగా ఈతకు సమీపంలోని బావిలోకి ట్యూబ్‌లతో దిగాడు. ప్రమాదవశాత్తు ట్యూబ్‌ల నుంచి జారిపోయిన వెంకటేష్ నీటిలో మునిగి మృతి చెందాడు. వెంకటేష్‌ను కాపాడేందుకు మరో విద్యార్థి ప్రయత్నించి మృతి చెందినట్లు తెలుస్తుంది. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు తమిళనాడుకు బయలుదేరి వెళ్లారు. నాగేశ్వరరావు వ్యవసాయం కుటుంబం అయినప్పటికీ కుమారుడిని ఉన్నత చదువులు చదించాలన్న ఉద్దేశంతో తమిళనాడులోని కళాశాలలో ఇంజనీరింగ్ చదివస్తున్నారు. ఆయనకు కుమార్తె, కుమారుడు కాగా కుమార్తెకు వివాహం అయింది. చేతికి అంది వచ్చే వయస్సులో కుమారుడు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## తీరంలో నేర నియంత్రణపై పర్యవేక్షణ

రామాపురం(చీరాల), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : తీరంలో ఎటువంటి నేరాలు జరుగకుండా నిత్యం పర్యవేక్షణ ఉండాలని రూరల్ సీఐ పంతగాని శేషగిరిరావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి తీరంలో డ్రోన్ కెమెరాతో పర్యవేక్షించారు. అనుమానిత స్థావరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

## వాడరేవులో వివాదంపై జిల్లా యంత్రాంగం ఆరా

చీరాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు తీరంలో నెలకొన్న సీఐ, ఏఎస్సై, వ్యాపారి వివాదంపై జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే నిఘా వర్గాల ద్వారా పూర్తిస్థాయిలో నివేదిక తెప్పించుకుని, ఆ అంశంపై ఆరా తీస్తుంది. దీనిపై వివాదానికి తెరలేపిన వారిని సోమవారం విచారించనున్నట్లు సమాచారం. విచారణ అనంతరం ఏ క్షణమైనా చర్యలు ఉండవచ్చని పోలీసు శాఖలో చర్చ సాగుతుంది. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి సమాచారం ఇప్పటికే ఏసీబీకి కూడా చేరినట్లు తెలిసింది. ఆదాయానికి మించిన ఆస్తులపై కూడా ఆరా తీసే అవకాశం ఉన్నట్లు సమాచారం.



ఉష్ణోగ్రత వివరాలు

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నెల్లూరు | 40.1 | 28.6 |
| కావలి | 37 | 28 |
| ఆత్మకూరు | 40 | 27 |
| ఉదయగిరి | 39 | 27 |
| కందుకూరు | 37 | 29 |



# తప్పు తేలినా శిక్షలేవీ?




- గ్రేడ్-1 పంచాయతీల్లో భారీగా నిధుల దుర్వినియోగం
- విచారించి నిగ్గుతేల్చిన జిల్లా అధికారులు
- పదిమందిపై కమిషనరేట్‌కు నివేదికలు
- ఇప్పటికీ అక్రమార్కులపై చర్యలు శూన్యం
- డబ్బులిచ్చి మేనేజ్ చేసుకుంటున్నట్లు ఆరోపణలు
- జిల్లాస్థాయిలో వెంటనే వేటువేస్తున్న కలెక్టర్

నెల్లూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : 'నవ్విపోదురుగాక మాకేంటి'... అన్న రీతిలో ఉంది పంచాయతీరాజ్‌శాఖలో ఉన్నతాధికారుల తీరు. ప్రజల సొమ్మును దిగమింగిన అవినీతి అధికారులు దర్జాగా తిరుగుతుండగా, చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం మాకేం సంబం‌ధం లేదన్నట్లుగా వ్యవహరిస్తు న్నారు. జిల్లాలోని గ్రేడ్-1, గ్రేడ్-2 పంచాయతీల్లో గతంలో భారీగా నిధులు దుర్వినియోగమయ్యాయి. పంచాయతీ కార్యదర్శులే ఈ సొమ్మును వారి ఖాతాలకు మళ్లించుకున్నారు. కొన్ని చోట్ల పంచాయతీ కార్యదర్శులు విధులను దుర్వినియోగం చేశారు. ఇవన్నీ జిల్లాస్థాయి విచారణలో బట్టబయలయ్యాయి. అయినా అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవడం లేదు. గ్రేడ్-1, గ్రేడ్-2 పంచాయతీలకు సంబంధించిన అవినీతి వ్యవహారాల నివేదికలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు రాష్ట్ర కమిషనరేట్‌కు పంపుతున్నారు. అయితే అక్కడి నుంచి తదుపరి ఎలాంటి ఉత్తర్వులు వెలువడడం లేదు. గ్రేడ్-1, గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకునే అధికారం పంచాయతీరాజ్ కమిషనర్‌కు మాత్రమే ఉంది. అంతకు తక్కువగా ఉన్న పంచాయతీల్లో జరిగిన అవినీతి వ్యవహారాలపై చర్యలు తీసుకునే అధికారం కలెక్టర్‌కు ఉంది. అయితే కలెక్టర్ వద్దకు వెళ్లే నివేదికలపై వెంటనే చర్యలు తీసుకుంటుండగా, కమిషనరేట్‌కు వెళ్లే నివేదికలు మాత్రం బయటకురావడంలేదు.

**12 మందిపై చర్యలకు సిఫార్సు**

గత ఆరునెలల కాలంలో సుమారు 12 మంది పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్‌డీలపై చర్యలు తీసుకోవాలని జిల్లా నుంచి విచారణ నివేదికలతో అధికారులు సిఫార్సు చేశారు. కానీ ఇప్పటివరకూ వారిపై చర్యలు తీసుకోలేదు. కలెక్టర్ వద్దకు ఫైల్‌వెళితే వారంలో తిరిగి వస్తుండగా, కమిషనరేట్‌కు ఫైల్ వెళితే మాత్రం నెలలు తరబడినా బయటకు రావడం లేదు. అవినీతి అధికారులు రాష్ట్రస్థాయిలో మేనేజ్ చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉదాహరణకు చూస్తే.. రూ.లక్ష నిధులు దుర్వినియోగం చేశారని మూడు రోజుల క్రితం ఓ పంచాయతీ కార్యదర్శిని కలెక్టర్ సస్పెండ్ చేశారు. అయితే రూ.1.25 కోట్లు నిధులు దుర్వినియోగం చేశారని ఓ పంచాయతీ కార్యదర్శిపై కమిషనరేట్‌కు నివేదిక వెళ్లి రెండు నెలలు దాటినా ఇంత వరకూ చర్యలు తీసుకోలేదు. ఈ పరిస్థితి ఇప్పుడు పంచాయతీ వ్యవస్థలో చర్చనీయాంశంగా మారింది.

**కమిషనరేట్‌కు అవినీతి వ్యవహారాలు**

- కోవూరు పంచాయతీలో ఓ గ్రామ కార్యదర్శి రూ.2.47 కోట్ల సొమ్మును తన ఖాతాలో వేసుకున్నారు. ఇందులో రూ.1.25 కోట్లు దుర్వినియోగం చేసినట్లు తేలింది. ఇలాగే మరో అక్రమ వ్యవహారానికి కూడా పాల్పడ్డారు. అనధికార లేఅవుట్లో నిబంధనలకు విరుద్ధంగా ఏడు బిల్డింగ్‌లకు ప్లాన్‌లు మంజూరు చేసి అవినీతికి పాల్పడారు. ఈ రెండు వ్యవహారాలపై వేర్వేరుగా నివేదికలు కమిషనరేట్‌కు వెళ్లాయి.
- కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీలో ఓ కార్యదర్శి ఏకంగా రూ.1.20 కోట్ల పంచాయతీ నిధులను తన సొంత ఖాతాకు మళ్లించుకున్నారు. అందులో రూ.25 లక్షల వరకూ దుర్వినియోగం చేశారు. ఈ మేరకు విచారణలో నిర్ధారణ జరిగింది.
- తిరుపతి జిల్లా చిల్లకూరు గ్రామ పంచాయతీ పేరు మీద రిజిస్ట్రేషన్ జరగాల్సిన ఓ లేఅవుట్‌లోని పది శాతం ఓపెన్ స్పేస్ భూమిని ఓ పంచాయతీ కార్యదర్శి తన పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రస్తుతం ఈ కార్యదర్శి జిల్లాలో ఓ మండలానికి ఈవోపీఆర్‌డీగా పనిచేస్తున్నారు.
- పొదలకూరు పంచాయతీలో గతంలో పనిచేసిన ఓ కార్యదర్శి అనధికార లేఅవుట్లలో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేశారు. అలానే ప్రభుత్వ భూములకు ఎన్‌వోసీలు కూడా జారీ చేసి భారీ దుర్వినియోగానికి పాల్పడ్డారు.
- బుచ్చి మండలం ఇస్కపాలెం పంచాయతీలో గతంలో పనిచేసిన ఓ పంచాయతీ కార్యదర్శి అక్కడి రికార్డులను మాయం చేశారు. ఈ రికార్డులను మున్సిపాలిటీకు అప్పగించలేదు. దీని వెనుక పెద్ద మతలబే ఉన్నట్లు అధికారుల విచారణలో తేలింది.
- మనుబోలు మండలం జట్లకొండూరులో పనిచేసిన మరో కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేశారు. అలానే ఈ భవనాల నుంచి తక్కువ పన్నులు వసూలు చేసినట్లు అధికారుల విచారణలో బయటపడింది.
- విడవలూరు మండలం ముదివర్తి పంచాయతీలో నిధులు దుర్వినియోగం చేసినందుకు ముగ్గురు కార్యదర్శులు, చిల్లకూరు మండలం మోమిడి గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం చేసినందుకు మరో కార్యదర్శిని బాధ్యులుగా గుర్తిస్తూ జిల్లా అధికారులు వీరిపై చర్యలకు సిఫార్సు చేశారు.
- ఏఎస్‌పేట పంచాయతీలో ఆక్రమణలు తొలగించ కుండానే తొలగించినట్లుగా తప్పుడు నివేదికను లోకాయుక్తకు అందజేశారు. ఈ వ్యవహారంలో భారీ అవకతవకలు జరిగినట్లు విచారణలో తేటతెల్లమైంది. ఈ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలంటూ కమిషనరేట్‌కు నివేదిక పంపారు. అయితే వీటిన్నంటిపై ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.





కోవూరు చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు (ఇన్‌సర్ట్‌లో) మాట్లాడుతున్న పాస్టర్ దివ్య

## వైభవంగా ఈస్టర్ వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చర్చిల్లో ఆదివారం క్రీస్తు పునరుత్థాన వేడుకలను క్రైస్తవులు వైభవంగా జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడే( శుక్రవారం) నాడు క్రీస్తుకు శిలువ వేశాక, ఆయన తన విశ్వాసులతో 'బాధపడకుడి.. నేను మూడోరోజున లేచి వస్తాను. ఎల్లప్పుడూ మీవెంటే ఉండి, సహాయం చేస్తా' అని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మూడోరోజు ఆదివారం తెల్లవారుజామున సమాధి బండను తొలగించుకుని తెల్లనివస్త్రాలతో క్రీస్తు దర్శనం ఇచ్చి అంతర్థానం అయిన సందర్భంగా ఆదివారం ఈస్టర్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. శనివారం అర్థరాత్రి నుంచి క్రీస్తు పునరుత్థానం సమయం వరకు అన్నీ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు పునరుత్థానాన్ని దృశ్యరూపకంలో ప్రదర్శించేందుకు చర్చిల్లో భారీ సెట్టింగులు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి స్నేహితులు, బంధువులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేసి, స్వీట్లు పంచుకున్నారు.

**బిషప్ హౌస్‌లో అగ్నిప్రమాదం**

నగరంలోని బిషప్ హౌస్‌లో క్రీస్తు పునరుత్థానం సందర్భంగా భారీగా ప్రత్యేక సెట్టింగ్‌లు విద్యుత్, పుష్పాలంకరణలు చేశారు. బిషప్ డాక్టర్ ఎండీ ప్రకాశం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, బైబిల్ వాక్యాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. క్రీస్తు పునరుత్థాన సమయంలో వెలుగులు చిమ్మేందుకు చిచ్చుబుడ్లను ఏర్పాటు చేశారు. ఉవ్వెత్తున లేచిన చిచ్చుబుడ్డి నిప్పురవ్వలు టార్పాలిన్‌పై పడడంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు లేచాయి. దీంతో భక్తులంతా భయాందోళనలకు గురయ్యారు. సమయస్ఫూర్తితో మంటలను ఆర్పి వేయడంతో ప్రమాదం తప్పింది. బిషప్ హౌస్ వందేళ్ల చరిత్రలో ఇలాంటి దురదృష్టకర సంఘటన చోటు చేసుకోలేదు.



## వేసవిలోనూ పెరగని నిమ్మ ధర

**● లూజు బస్తా రూ. 6 వేల నుంచి రూ.7,800 వరకు**



పొదలకూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేసవిలోనూ నిమ్మకాయల ధరలు ఆశించిన స్థాయిలో పెరగలేదు. ప్రస్తుతమున్న ధరలు గిట్టు బాటయ్యేలా ఉన్నా, వేసవిలో ఇంకా పెరిగితే రైతులు ఆర్థికంగా నిల దొక్కుకునే అవకాశం ఉంది. అయితే ఈనెల రెండో వారంలోనే ఉన్న ధరలు ప్రస్తుతం లేవు. తాజాగా లూజు (బస్తా) రూ.6వేల నుంచి రూ.7,800 వరకు ఉంది. కిలోల లెక్కన చూస్తే రూ.70 నుంచి రూ.90 వరకు ఉన్నట్లు వ్యాపారులు పేర్కొన్నారు. సాధారణంగా మార్చి, ఏప్రిల్ నెలల్లో లూజు (బస్తా) అత్యధికంగా రూ.10వేల వరకు పలుకుతోంది. ఈ ఏడాది నిమ్మకాయలకు ఆశించిన స్థాయిలో డిమాండ్ లేదంటున్నారు. ఢిల్లీ మార్కెట్‌కు గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల నుంచి నిమ్మకాయలు ఎగుమతి అవుతున్నాయి. ఫలితంగా కాయలు ఎక్కువై ధరలు తగ్గుతున్నట్లు వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.



ఆత్మకూరులో ఆదివారం వేద పండితులకు సంభావన చెక్కు అందచేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

## చంద్రబాబుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు

**● సీఎం జన్మదిన వేడుకల్లో మంత్రి ఆనం**

ఆత్మకూరు,ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అపారమైన అనుభవం, సమర్థవంతమైన పాలనతో రాష్టానికి మంచి భవిష్యత్‌ను అందించే ఏకైక నేత సీఎం చంద్రబాబునాయుడేనని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆత్మకూరులో సీఎం నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేలాదిమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణకు తరలిరాగా, ఆగమశాస్త్ర పండితులు, దేవదాయశాఖ అధికారులు సమక్షంలో సీఎం చంద్రబాబుకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షును ఇవ్వాలని కోరుతూ మహాహోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ప్రపంచంలోని తెలుగువారందరికీ, సుదీర్ఘకాలం రాష్ట్రానికి చంద్రబాబు సేవలు అందించాలని కోరుతూ హోమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన సుమారు 8000 మందికి వస్త్రాలు పంపిణీ చేశామని, ప్రతి ఒక్కరికి తిరుమల లడ్డూను అందచేశామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు దేవదాయశాఖకు సంబంధించిన 95 శాతం హామీలు అమలు చేశామన్నారు.వేదం అధ్యయనం చేసి, ఖాళీగా ఉన్న వారికి నెలకు రూ. 3000 చొప్పున సంభావన అందించేందుకు సీఎం చంద్రబాబు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆయన జన్మదినం సందర్భంగా ఇక్కడ ప్రారంభిస్తున్నట్లు ఆనం తెలిపారు. అనంతరం దేవదాయ శాఖ జోనల్ అధికారి, శ్రీకాళహస్తి ఈవో బాపిరెడ్డితోకలిసి వేద పండితులకు సంభావన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తాళ్లూరు గిరినాయుడు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, సివిల్ సప్లయిస్ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ ప్రకటన... నిరుద్యోగుల్లో ఆనందం

● తీరనున్న అభ్యర్థుల నిరీక్షణ ● జిల్లాలో భర్తీ కానున్న 673 టీచర్ పోస్టులు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ప్రకటన విడుదల చేసింది. దీంతో తమ కలలు సాకారం అవుతుండడంతో నిరుద్యోగుల్లో ఆనందం నెలకొంది. మెగా డీఎస్సీ పేరుతో వైకాపా ప్రభుత్వం దగా చేసింది. అయితే ఎన్నికల ముందు మాటిచ్చిన చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టగానే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారు.

**● 20వేల మంది నిరీక్షణ**

రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రకటించిన ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహణకు ఆమోదం తెలిపింది. ఉద్యోగ ఖాళీలు అధికంగా ఉన్నా, గత జగన్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆశలను నీరుగార్చేలా నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పట్లో విద్యార్థి సంఘాలు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం నిరుద్యోగులకు ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకోవడంతో ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఈ డీఎస్సీలో కొత్తగా బీఈడీ, డీఎడ్ పూర్తి చేసుకున్న వారికీ అవకాశం కల్పించనున్నారు. జిల్లాలో గత ఐదేళ్లలో డీఎడ్ పూర్తి చేసిన వారు 10వేల మంది, బీఈడీ పూర్తి చేసిన మరో 10వేలమంది కలిపి 20వేల మంది వరకు నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో అత్యధికశాతం గ్రామీణ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువతే ఉపాధ్యాయులుగా స్థిరపడాలన్న ఆలోచనలతో రూ.లక్షలు వెచ్చించి కోర్సులను పూర్తి చేశారు.




**● జిల్లాలో ఖాళీల వివరాలు**

జిల్లావ్యాప్తంగా జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో 673 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో లాంగ్వేజ్-1 39, హిందీ 18, ఇంగ్లిష్ 84, మ్యాథ్స్ 63, ఫిజికల్ సైన్స్ 76, బయాలజీ 63, సోషల్ 103, ఫిజికల్‌ఎడ్యుకేషన్ 107, ఎస్‌జీటీ 115 కలిపి మొత్తం 668 పోస్టులు, ట్రైబుల్ వెల్ఫేర్ విభాగంలో హిందీ 1, ఇంగ్లిష్ 1, మ్యాథ్స్ 1, ఎస్‌జీటీ 2 కలిపి 5 పోస్టులు, రెండు విభాగాల్లో 673 పోస్టులు ఉన్నట్లు గుర్తించారు. అభ్యర్థులు మే 15వతేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే20న మాక్ టెస్ట్, మే30న హాల్‌టికెట్లు విడుదల చేయనున్నారు. జూన్ 6, 7తేదీల్లో పరీక్షలు నిర్వహించి రెండురోజుల్లోనే ప్రాథమిక కీ విడుదల చేస్తారు. కీ విడుదలైన తరువాత వారంపాటు అభ్యంతరాలను స్వీకరించి, అనంతరం తుది కీ విడుదల చేస్తారు. అనంతరం వారంలోపు మెరిట్ జాబితాను ప్రకటిస్తారు. పూర్తి వివరాలు cse.ap.gov.in/apdsc.apcfss.in అనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.

## రేషన్ పంపిణీ అస్తవ్యస్తం

- కార్డుదారులకు ఇచ్చే బియ్యంలో కోత
- డీలర్లు మారడంతోనే సమస్య
- కొత్తవారికి అందచేయని నిల్వ వివరాలు
- ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే కుట్ర

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. గత మూడునెలల నుంచి చౌకదుకాణాలకు బియ్యం కేటాయింపుల్లో భారీగా కోతపడుతోంది. ఫలితంగా కొంతమంది కార్డుదారులకు బియ్యాన్ని ఇవ్వలేక పోతున్నారు. గత ప్రభుత్వ పాలనలో నాయకులతో చేతులు కలిపిన కొందరు డీలర్లు, ఎండీయూ వాహనాల నిర్వాహకులు బియ్యాన్ని పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. కార్డుదారులు ఏప్రాంతంలోనైనా సరుకులు తీసుకునేలా పోర్టబిలిటీ విధానం అమల్లో ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా కొంతమంది డీలర్ల నియామకం జరిగింది. వైసీపీ పాలనలో పనిచేసిన డీలర్ల వద్ద టన్నుల బియ్యం నిల్వ ఉండగా, కొత్త వారికి ఇవ్వకుండా ఈ-పాస్ యంత్రాన్ని మాత్రమే అప్పగించారు. కొత్తగా వచ్చిన డీలర్లకు నిల్వ బియ్యం కింద లెక్క చూపిస్తూ కేటాయింపుల్లో అధికారులు కోత విధించారు. దీంతో కొంతమంది కార్డుదారులకు బియ్యం ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. కొత్త డీలర్‌కు, పాత డీలర్ వద్ద నిల్వ ఉన్న బియ్యం సమాచారం తెలియదు. అధికారులూ చెప్పటం లేదు.



ఎండీయూ వాహనం ద్వారా జరుగుతున్న బియ్యం పంపిణీ

**● ప్రభుత్వంపై కక్షతోనే....**

ఎండీయూ ఆపరేటర్లు కూటమి ప్రభుత్వంపై కక్షతో బియ్యం పంపిణీలో కోత పెట్టడంతో చివరన వచ్చిన లబ్ధిదారులకు ఇవ్వలేక పోతున్నామనే ప్రచారం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసే కుట్ర చేస్తున్నట్లు సమాచారం. పౌరసరఫరాలశాఖలో కొందరు అధికారుల సహాయ నిరాకరణ కారణంగా డీలర్లు సమస్యను ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన తప్పులకు ప్రస్తుతం తమను బలిచేస్తున్నారని డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బియ్యం కేటాయింపులో కోత పడుతుందడటంతో డీలర్లు వారికి కేటాయించిన మేరకే బియ్యం పంపిణీ చేస్తున్నారు. దీంతో పేదలకు బియ్యం అందటం లేదు. వారు బియ్యం కోసం రేషన్ షాపులకు వెళ్లటం, డీలర్లు బియ్యం లేవని చెప్పడం జరుగుతోంది. గత మూడు నెలల నుంచి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి. పేదలు బహిరంగ మార్కెట్లో అధికధరలకు బియ్యం కొనలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం**



బియ్యం కేటాయింపుల్లో కోత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతాం. వచ్చే నెల కోటా నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయిస్తాం.

- విజయకుమార్, డీఎస్వో

## చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 100 |
| స్కిన్ చికెన్ | 184 |
| స్కిన్‌లెస్ | 204 |

కోడిగుడ్ల ధర (100): 420

## బంగారం, వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (22 క్యారెట్లు) | |
| ఒక గ్రాము ధర | రూ.9213 |
| వెండి కిలో ధర | రూ. 98.400 |
| వెండి ఒక గ్రాము | రూ.101.40 |

## రామాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ

ఉలవపాడు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బద్దిపూడిలోని రామాలయంలో ఆదివారం జరిగిన సీతారాముల కల్యాణంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా కరేడు పంచాయతీ ధర్మారెడ్డి సంఘం ఎస్టీకాలనీలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

## న్యూస్ బాక్స్

### బలవంతపు భూసేకరణ ఆపాలి

ఉలవపాడు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ప్రభుత్వం కారుచౌకగా ఎస్సీ, ఎస్టీల భూములు అప్పగించాలనే ప్రయత్నం ఆపాలని కరేడు పంచాయతీ పరిధిలోని ఉప్పరపాలెం ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం సీఐటీయూ నాయకులతో కలసి రామకృష్ణాపురం, పొట్టేనుగుంట, ఉప్పరపాలెంకు చెందిన ఎస్సీ, ఎస్టీలు నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకుడు జీవీబీ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న భూసేకరణ పట్ల కరేడు ప్రజల భయాందోళనలు తొలగించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సంఘం నాయకురాలు పొన్నం రామలక్ష్మమ్మ, సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు, రామకోటయ్య, ఎస్.గిరి, వీసం విజయ్, నాగార్జున, సుజాత, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

### జేవీవీకి యువరక్తం అవసరం

కావలిటౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదికకు యువ రక్తం అవసరమని జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జేవీవీ కార్యాలయంలో జరిగిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని భవిష్యత్ ప్రణాళికను వివరించారు. కావలి శాఖ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చేపట్టిన పలు చైతన్య సేవా కార్యక్రమాల గురించి వివరించారు. సమావేశంలో జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, ప్రధాన కార్యదర్శి హరనాథ్, కోశాధికారి సుబ్బరామశర్మ, జిల్లా ఉపాధ్యక్షులు జానకిరామ్, కల్యాణి, మాధవ పాల్గొన్నారు.

### టీడీపీ నేత సోదరుడి మృతికి పలువురి సంతాపం

లింగసముద్రం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగిరేకులపాడు మాజీ సర్పంచు, టీడీపీ నేత ముప్పరాజు వెంకటేశ్వర్లు సోదరుడు నాగేశ్వరరావు(65) శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, మండల ఇన్‌చార్జ్ గుళ్లా సుధాకర్, విశ్వనాథపురం గ్రామ సర్పంచు బొల్లినేని నాగేశ్వరరావు ఆదివారం ఉదయం అంగిరేకులపాడులో నాగేశ్వరరావు మృతదేహానికి నివాళులర్పించారు.

### క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

కొండాపురం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని పలు గ్రామాల చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ఆత్మీయులకు విందు ఏర్పాటు చేశారు.

### నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

సంగం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

### నేడు సీతారాములకు ప్రత్యేక పూజలు

ఉదయగిరి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సుద్ధబావి వీధిలో ఉన్న కోదండ రామస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం సీతారామచంద్రస్వామి వార్లకు పూలంగి సేవ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా స్వామివార్ల కల్యాణోత్సవం నిర్వహించి 16 రోజులైన సందర్భంగా ఈ వేడుక నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు సీతమ్మతల్లి సారెగా పసుపు, కుంకుమ, తాంబూలం పంచడం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### నేడు వీకేపాడు మండల సమావేశం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో శాఖల వారీగా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించడంతోపాటు భవిష్యత్తు కార్యాచరణపై చర్చించడం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

# అభివృద్ధి ప్రదాత చంద్రబాబు : ఇంటూరి



కందుకూరులో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, నాయకులు



దగదర్తిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మాలేపాటి సోదరులు

కందుకూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి ప్రదాత అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే గ్రామదేవత అంకమ్మ ఆలయంలో చంద్రబాబునాయుడు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి 108 కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం పార్టీ కార్యాలయంలో 75 కిలోల భారీ కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో పేదలకు ఉచితంగా భోజన ఏర్పాట్లు చేసి వారితో కలసి ఎమ్మెల్యే అక్కడే భోజనం చేశారు. ఏరియా ఆసుపత్రి, కోవూరురోడ్డులోని స్వర్ణ స్వయం కృషి మానసిక దివ్యాంగుల పాఠశాలల్లో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, వేముల గోపాలరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, కంద్రా మాల్యాద్రి, చిలకపాటి మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని పామూరురోడ్డు సర్కిల్‌లో టీడీపీ నాయకుడు మాదాల రవీంద్ర ఆధ్వర్యంలో, గుర్రంవారిపాలెం, డీవీ నగర్ ప్రాంతంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేకు కట్‌చేసి జన్మదిన వేడుకలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు.

● మండలంలోని పందలపాడు జాషువా కాలనీలోని చర్చిలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ఆధ్వర్యంలో కేకు కట్‌చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంజుల రామచంద్రారెడ్డి, కంజుల రంగారెడ్డి, పుట్టా వెంకటరామిరెడ్డి, వర్ల రమేష్, గోచిపాతల లింగయ్య, కన్నెదారి బ్రహ్మానాయుడు పాల్గొన్నారు.



అల్లూరులో కేక్ కట్ చేసి నాయకులకు తినిపిస్తున్న బీద గిరిధర్

**కావలి :** చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు కావలిలో ఘనంగా నిర్వహించారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి టీడీపీ శ్రేణులకు పంచిపెట్టారు. అనంతరం కావలి ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. ట్రంకురోడ్డులోని అన్నా క్యాంటీన్‌లో పేదలకు అన్నదాన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య, అన్నదాత మణి, పోట్లూరు శ్రీనివాసులు, బొట్లగుంట శ్రీహరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

**● ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు**

**అల్లూరు :** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలు అల్లూరు పాతబస్టాండు కూడలిలోని వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సోమశిల కమిటీ ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ భారీ కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గుంజి రుద్రయ్య, ప్రభాకర్, తోట శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

**గుడ్లూరు :** స్థానిక బస్టాండ్ సెంటర్‌లో తెలుగు యువత మండల అధ్యక్షుడు చెన్నారెడ్డి మహేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా వెంకటేశ్వర్లు, కోకా చిరంజీవి, మద్దసాని కృష్ణ, అమరా మాల్యాద్రి, మన్నం సుబ్బారావు, బీజేపీ నాయకుడు సుధాకర్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

**కొండాపురం :** కొండాపురం, గరిమెనపెంట, భీమవరప్పాడు, ఆదిమూర్తిపురం గ్రామాల్లో కేకు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ వైస్ఎంపీపీ పోలినేని చంద్రబాబు నాయుడు, నాయకులు పీ.రమేష్, దాసరి అశోక్, నర్రా శివన్నారాయణ, యారవ క్రిష్ణయ్య, జాగర్లమూడి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ చాగంటి క్రిష్ణ పాల్గొన్నారు. చంద్రబాబునాయుడు ఆయురారాగ్యాలతో ఉండాలని స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.

**బిట్రగుంట :** బోగోలు టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పేదలకు భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లరెడ్డి, రాముర్‌నాయుడు, బీజేపీ నేతలు ఎన్ఎస్‌యాదవ్, వీ.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. అలాగే బోగోలు ఇంచార్జి చిలకపాటి వెంకటేశ్వర్లు, నేతలు జీ.నాగరాజు, శీనయ్య, ఎం.వేంకటేశ్వర్లు, ప్రభాకర్, అరుణమ్మలు కేక్ కట్ చేశారు.

**● మహిళలకు చీరల పంపిణీ**

దగదర్తి మండలం వెలుపోడు సెంటర్‌లో రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, యువనాయకుడు మాలేపాటి భానుచందర్ నాయుడు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం మండలంలోని దాదాపు రెండు వేల మంది మహిళలకు చీరలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాలేపాటి సుధాకర్ నాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఉలవపాడు :** మండలంలోని కరేడు పంచాయతీ ధర్మారెడ్డి సంఘంలో ఎస్టీ మహిళలతో కలిసి కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి ఎస్టీ మహిళలు కేక్ తినిపించారు. ఉలవపాడులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగు తమ్ముళ్లు కేక్ కట్ చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

**లింగసముద్రం :** లింగసముద్రం కోటయ్య మందిరం వద్ద టీడీపీ గ్రామ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్ కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడపా రంగయ్య, పూరిమిట్ల బాలకోటయ్య, యు నాగేశ్వరరావు, అడపా నర్సయ్య, మక్కెన మల్లికార్జున, సీహెచ్ బాలకోటయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే చినపవనిలో నాయకులు సోంపల్లి మనోహర్, మోతుకూరి పర్వతాలు, ఏలూరి వెంకటేశ్వర్లు, తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు.



కావలిలో సీఎం జన్మదిన కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

## పండుగలా అభివృద్ధి పనుల ప్రారంభం

జలదంకి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రారంభోత్సవాల కార్యక్రమం పండుగలా జరిగింది. మండలానికి చేరుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ టీడీపీ శ్రేణులతో కలసి గ్రామాల్లో పర్యటించారు. జమ్మలపాలెంలో రూ.10.50 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, జలదంకిలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రూ.10లక్షలతో నిర్మించిన ఎంపీపీ భవనం, జలదంకిలో రూ.60 లక్షలతో, గమళ్లపాలెంలో రూ.50లక్షలతో, బ్రాహ్మణక్రాక పంచాయతీ హనుమకొండపాలెంలో రూ.45లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే జలదంకి, కమ్మపాలెం, చినక్రాకలో గోకులం షెడ్లను ప్రారంభించి గోమాతలకు మేత పెట్టారు.

### చంద్రబాబు జన్మదిన సంబరాలు

జలదంకి బస్టాండు కూడలిలో జరిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భారీ కేక్‌ను కట్ చేసి పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచల బాబుయాదవ్, ఎంఈపీ గోచిపాతల వెంకటరమణయ్య, నాయకులు వంటేరు జయచంద్రారెడ్డి, పీ.మధుమోహన్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, మధు సూదనరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాకర్లకు కేకు తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంభం

### సీసీ రోడ్లకు శంకుస్థాపన

**కలిగిరి :** మండలంలోని కలిగిరి- సంగం రహదారిలో వెలగపాడు పంచాయతీ పరిధిలో కొత్తూరు నుంచి పెద్దపాడు వరకు, కమ్మవారిపాలెంలో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శంకుస్థాపన చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, బిజ్జం కృష్ణారెడ్డి, బీవీ రామారావు, తాతయ్య, నరసింహులునాయుడు, జీ.శ్రీనివాసులు, ప్రసాదు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌ను తిరస్కరించండి

కందుకూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగానికి, సుప్రీం కోర్టు సూచనలకు విరుద్ధంగా ఉన్న ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఆర్డినెన్స్‌ను తిరస్కరిస్తూ న్యాయపోరాటాలకు మాలలు సిద్ధం కావాలని మాలమహానాడు, మాల ఉద్యోగుల సంఘం, మాలసంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో వద్ద ఆర్డినెన్స్ ప్రతులను చించివేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలేటి కోటేశ్వరరావు, లింగాబత్తిన బ్రహ్మయ్య, కట్టా రమేష్, చనమాల కోటేశ్వరరావు, చార్వాక, జనార్దన్, బొట్లగుంట శ్రీను పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ సంబరాలు

కలిగిరి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తేవడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం కలిగిరిలో సంబరాలు జరుపుకున్నారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

## ప్రమాద సమాచారం సకాలంలో అందించాలి

కావలి రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందిస్తే ప్రమాద తీవ్రత తగ్గించవచ్చని ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి జీ.ప్రభాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం జరిగిన అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవిస్తే 101, 112, 08626-243101, 9963734286కు సమాచారం ఇవ్వాలన్నారు. అగ్నిప్రమాదాల నిర్మూలనకు ఉపయోగించే పరికరాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు.

# వాడవాడలా ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు



సంగం: సంగమేశ్వరుడికి అభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు



మర్రిపాడు: సర్వమత ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు

సంగం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలను ఆదివారం సంగంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సంగమేశ్వరాలయంలోని పాతాళ శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కామాక్షి దేవి సమేత సంగమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగం బస్టాండ్‌లో బాణాసంచ కాల్చి భారీ కేక్‌ను కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఎస్సీ హాస్టల్ బాలికలకు, వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: అమరావతి రూపకర్త, అభివృద్ధి ప్రధాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో చంద్రబాబు జన్మదినం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్‌లతో కలిసి 75 కేజీల కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న తదితరులు పాల్గొన్నారు. కాగా, సీఎం చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో ఉండి రాష్ట్ర ప్రజలకు సేవ చేయాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయగిరి పట్టణంలోని ఆయన నివాస ఆవరణలో చంద్రబాబు జన్మదినం సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శాంతికుమారి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహా, గయాజ్, సజిల్, నవాజ్, ఉప్పుటూరి వెంకటయ్య, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

●వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో చంద్రబాబునాయుడి జన్మదినం సందర్భంగా మండల టీడీపీ కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

●కలువాయి : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలను ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ జీ వెంకటేశ్వర్లు నాయుడు, చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, జగదల్ నాయుడు, చల్లా శివారెడ్డి, జీ చంద్రమౌళి, చల్లా విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చంద్రయ్య నాయుడు, నాలి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

●అనంతసాగరం: చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలు ఆదివారం స్థానిక వ్యవసాయ సొసైటీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భారీ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉత్తర కాలువ చైర్మన్ మెట్టుకూరు కృష్ణారెడ్డి, మండల అధ్యకురాలు సునీత, సాగరం చెరువు నీటిసంఘం అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి, ఖాసీంబాష, మెట్టుకూరు సుబ్బారెడ్డి, తెలుగు యువత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●మర్రిపాడు: చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆరి కట్ల జనార్దన్‌నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్వమత ప్రార్థనలు చేసి, కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ శాఖమూరి నారాయణ, చిన్నారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎలగాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

●వింజమూరు: పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, నాయకులు కొండపల్లి వెంకటేశ్వర్లు, మంచాల శ్రీనివాసులునాయుడు, వేమలపాటి మాల్యాద్రి, చావా మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు. అలాగే బొమ్మచెరువు క్యాంప్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

●సీతారామపురం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మాజీ మండల కన్వీనర్ ముత్తంశెట్టి చెన్నకేశవులు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి, షేక్ బాబు, భోగినేని కాశీరత్తయ్య, దేవర వేంకటేశ్వర్లు, చంద్ర, నాగేశ్వరరావు, జాషువా, ఇజ్రాయిల్, తురక వెంకటేశ్వర్లు, చంద్రరెడ్డి, వికాష్‌బాబు, గౌస్, మండల టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.



ఉదయగిరి: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకురాలు శాంతికుమారి, తదితరులు



వరికుంటపాడులో కేకు కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

సంగం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు, జంగాలకండ్రిక, వంగల్లు, ఎస్‌వీఆర్ పురం తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక నెల్లూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి కమిటీ అధ్యక్షుడు సురమౌళి, సభ్యులు కోటేశ్వరరావు, శ్రీదేవి, రాజేంద్రప్రసాద్, నారాయణమ్మ, సుమలత, రఘురామయ్య సుమలత తదితరులు పాల్గొన్నారు.



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

## చిత్రకళలపై విద్యార్థులకు ఉచిత శిక్షణ

ఉదయగిరి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): చిత్రకళలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు సంస్కార భారతి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వై సుదర్శన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మే మాసంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రతి గురు, శుక్రవారాల్లో ఈ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు 8639740303 అనే నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## ఉచిత వైద్య శిబిరం

సంగం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కమ్యూనిటీ పారా మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాదాల మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైనవారిని వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని సీనియర్ టీడీపీ నాయకుడు కర్నాటి రవీంద్రరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీఎంపీ అసోసియేషన్ సభ్యులు జగన్, మహేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు